Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు · స్థాపితం: 1930 · జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

*Longest Living Newspaper in Telugu Journalism*

# జమీన్ రైతు

సంపుటి: 81 • సంచిక: 11 • 12-3-2010 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

హెల్త్‌కేర్ క్లినిక్
యునాని చికిత్స ద్వారా నయము చేయబడును
డాక్టర్ పర్వీన్ B.U.M.S
యునాని వైద్యనిపుణులు

లేజర్ చికిత్స
Professor, Endodontics
కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
ఫోన్: 2303300

# భానుశ్రీ పాపం పండింది!

- మంత్రి పదవికి రాజీనామా చేస్తానన్న ఆనం రామనారాయణరెడ్డి.
- ఆత్మహత్యే శరణ్యమనే నిర్వేదంలో ఆనం వివేకానందరెడ్డి.
- రాజీవ్‌భవన్ నిర్వాహకులకు నెల్లూరు జనం నీరాజనాలు పడుతున్నారు.
- నెల్లూరు జిల్లాలో తమ ఆజ్ఞ లేకుండా చీమ చిటుక్కుమనదన్న ధీమాతో వుండిన ఆనం వారి నడుములు విరిగాయి.

నెల్లూరు మేయర్ నందిమండలం భానుశ్రీ ఇంటిపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు జరిపారు. జిల్లా రాజకీయాలలో భూకంప సమానమైన పరిణామం ఇది. భానుశ్రీ అంటే ఒక రకంగా ఆనం కుటుంబ సభ్యురాలి క్రింద లెక్క. ఆమెను అనుచరురాలిగా కంటే ఆత్మీయురాలిగా అక్కున చేర్చుకొంటారు వారు. ఆమె ఇంటి మీద ఏసిబి దాడి అంటే, ఆనం వారి ఇంటి మీద దాడి జరిగినట్లే లెక్క. తమ ఆజ్ఞ లేనిదే జిల్లా పరిధిలో చీమ కూడా చిటుక్కుమనడానికి లేదని శాసించే ఆనం సోదరులకు ఇది పిడుగుపాటుతో సమానం. నెల్లూరులో అధికారుల ముందు, వంది మాగధుల ముందు డంబాలు పలకాల్సిందే తప్ప, అసలు ప్రభుత్వంలో వారి మాటకు చీపురు పుల్ల విలువ లేదని అందరికీ అర్థమయ్యేట్లు చేశాయి ఈ దాడులు.

భానుశ్రీ రాజకీయం మొదటి నుంచి వివాదాస్పదమే. మేయర్‌కాక ముందు, అయిన తర్వాత కూడా కార్పొరేషన్ వ్యవహారాలలో ఆమె మాట వేదవాక్కుగా చలామణి అవుతున్నది. కార్పొరేషన్‌కు ఏ నిధి వచ్చినా, ఏ కాంట్రాక్ట్ పని మంజూరైనా ఆమెకు సింహభాగం ఇవ్వాల్సిందే. మేయర్ అయిన తర్వాత ఈ దోపిడీ యజ్ఞం శృతి మించి పోయింది. నగర పరిధిలో ఎవరు ఇల్లు కట్టుకోవాలన్నా, అపార్ట్‌మెంట్ నిర్మించాలన్నా, వ్యాపారం నడుపుకోవాలన్నా మేయర్‌ను సంతృప్తి పరచడం తప్పనిసరి. ఆమె లేకుండా చిల్లర అంగడి ప్రారంభోత్సవం కూడా జరగడానికి లేదు. అన్ని ప్రభుత్వ కార్యక్రమాలలో ఆమెకు అధ్యక్ష స్థానం ఇవ్వాలి. అన్ని శిలాఫలకాలలో ఆమె పేరు వుండి తీరాలి. భానుశ్రీకి అంతగా అంతులేని అధికారం కట్టబెట్టాడు ఆనం వివేకానందరెడ్డి. దాన్ని ఆమె సక్రమంగా వినియోగించుకొని వుంటే ప్రజలలో పేరు ప్రతిష్టలు సంపాదించుకోవడానికి సదావకాశం. కానీ, అధికారాన్ని అహంకార ప్రదర్శనకు వాడుకొన్నారామె. తన సహచర కార్పొరేటర్లను కూడా బంట్రోతులుగా చూసింది. అధికారులను హీనంగా అవమానించింది. తనను కలిసి, చేతులు తడపని వారు, ఎవరైనా సరే చిత్రహింసలకు గురిచేసింది. నిర్మాణం పూర్తి చేసుకొన్న అపార్టుమెంట్లు కూడా మనిసిపల్ సిబ్బందిని పెట్టి పగలగొట్టించింది. తనకు గిట్టని వారు ప్లాన్ ప్రకారం ఇళ్లు కట్టుకొన్నా కూలదోయించింది. తన కోరిక తీరిస్తే రోడ్లు, మునిసిపల్ స్థలాలు, కాలువలు, పార్కులు ఆక్రమించి భవనాలు కట్టినా అనుమతించింది. భానుశ్రీ పుణ్యాన కొన్ని వందల లేఅవుట్ ఖాళీ స్థలాలు అదృశ్యమై పోయాయి. చివరకు దేవాలయాలలో కూడా ఆమె పెత్తనం, దాష్టీకం భరించలేని స్థాయికి చేరింది.

ఈ అరాచక ప్రవర్తన, అవధులు లేని అవినీతి మీద చాలాకాలంగా నెల్లూరు ప్రజలలో అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తమౌతూ వచ్చాయి. కానీ ఆనం వారి అధికార బలాన్ని చూసి ఎవరూ పెదవి విప్పలేకపోయారు. రాజీవ్‌భవన్ నిర్వాహకులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వై.వి.రామిరెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్ యాదవ్, రూప్‌కుమార్ యాదవ్ భానుశ్రీ అవినీతి మీద దండయాత్ర ప్రారంభించారు. ఆనం కుటుంబ బెదరింపులు, ఒత్తిడులు లెక్క చేయకుండా వ్యవహరించారు. భానుశ్రీ అక్రమార్జన మీద లోతైన దర్యాప్తు జరిపారు. అక్రమ ఆస్తులు వెలికి తీశారు. వాటన్నిటినీ ఏసిబి అధికారులకు అందజేశారు. అన్ని ఆధారాలు తమ చేతికి వచ్చిన తర్వాత ఏసిబి శాఖ కళ్లు మూసుకొని వుండలేదు కదా. చట్టం ప్రకారం దాడి జరిపారు.

అయితే భానుశ్రీ భర్త నందిమండలం వెంకట శివసుబ్బరాజు ప్రభుత్వ ఉద్యోగి కావడంతో భానుశ్రీ అక్రమ ఆర్జన సమస్తం ఆయన ఖాతాలో జమ చేయక తప్ప లేదు. దానితో దాడుల తర్వాత భానుశ్రీకి బదులుగా, సుబ్బరాజును అరెస్టు చేశారు ఏసిబి అధికారులు. నెల్లూరులో వుంచితే రాజకీయ ఒత్తిడులు అధికంగా వుంటాయనే భావనతో ఆయన్ను ఆ రోజే హైదరాబాద్‌కు తరలించి, అక్కడి ఏసిబి కోర్టులో ప్రవేశపెట్టారు. 15రోజుల రిమాండ్ మీద చర్లపల్లి జైలుకు తరలించారు.



ఏసిబి దాడితో నిశ్చేష్టురాలైన మేయర్ భానుశ్రీ.

ఈ దాడులలో పెద్దఎత్తున అక్రమ ఆస్తులు బయటపడ్డాయి. నెల్లూరు నగరంలో 18 ఇళ్ల స్థలాలు, రెండు ఇళ్లు, హైదరాబాద్ శివార్లలో ఒక ఖరీదైన స్థలం, కనుపర్తి పాడులో రెండెకరాల

కొరవ 16వ పేజీలో






# చారిత్రాత్మకమైన బిల్లు

మహిళా రిజర్వేషన్ బిల్లు రాజ్యసభ ఆమోదం పొందడం స్వతంత్ర భారత చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టం అనడంలో అతిశయోక్తి ఏమీ లేదు. సమాజంలో సగం జనాభా మహిళలది. కుటుంబంలో సగం భారం మహిళది. కానీ చట్ట సభలలో మాత్రం వారికి కనీసపాటి ప్రాతినిధ్యం లేదు. పదవిలో వున్న భర్త మరణించినప్పుడు, మరేదైనా కారణంతో ఆయన పోటీ చేయలేని పరిస్థితి వచ్చినప్పుడు మాత్రమే మహిళలను అభ్యర్థులుగా నిలబెడుతున్నాయి రాజకీయపార్టీలు. స్వతంత్రంగా రాజకీయ హోదా సంతరించుకొనే మహిళల సంఖ్య వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. చట్ట సభలలో చేసే శాసనాలలో, తమ సమస్యలకు పరిష్కారాలు చెప్పడానికి, అభిప్రాయాలు వ్యక్తీకరించడానికి మహిళలకు అవకాశం లభించడం లేదు. అందువల్ల మహిళా సంబంధిత వ్యవహారాలను కూడా మగవాళ్లే నిర్ణయించవలసిన దుర్గతి. సమాన న్యాయ సూత్రాన్ని విఫలం చేసే ఈ అసమానతను నిర్మూలించడానికి చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్ ప్రవేశ పెట్టాలని మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ కలలు కన్నారు. అందుకు ప్రారంభంగా స్థానిక సంస్థలన్నింటిలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ వసతి కల్పిస్తూ రాజ్యాంగ సవరణ కూడా చేశాడు. అయితే పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీల విషయంలో ఆయన ప్రయత్నించి సఫలం కాలేదు. ఆ తర్వాత వచ్చిన దేవగౌడ కూడా ప్రయత్నించి విఫలమైనాడు. అటు పిమ్మట ఐకె.గుజ్రాల్ ఈ ప్రయత్నాన్ని బిల్లు రూపకల్పన దశవరకు తెచ్చి, పక్కకు తప్పుకొన్నాడు. అప్పటి నుంచి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెట్టడానికి ప్రయత్నించినప్పుడల్లా ఒక రాజకీయనేతలు అడ్డుపుల్ల వేశారు.

తన భర్త కన్న కలలు నెరవేర్చాలనే కోరిక మాత్రమే కాకుండా, ఒక మహిళానేతగా భారతీయ మహిళలకు శాశ్వత సమన్యాయం సిద్ధింప చేయాలన్న దృఢ సంకల్పంతో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఈ భారాన్ని తన భుజాలకెత్తుకొన్నారు. ఈ ప్రయత్నానికి బిజెపి, సిపిఎం వంటి జాతీయ పార్టీలు పూర్తి సహకారం అందించేట్లు చూసుకోవడంలో సోనియాగాంధీ రాజనీతిజ్ఞత అందరి ప్రశంసలు పొందుతున్నది. అయితే ఇల్లలుకగానే పండుగ కానట్లే, రాజ్యసభ ఆమోదంతో ఇది చట్టంగా మారదు. లోక్‌సభ ఆమోదం కూడా కావాలి. యాదవ త్రయంగా ప్రసిద్ధికెక్కిన లల్లు, ములాయం, శరద్‌లు దీన్ని తమ శక్తినంతా ఉపయోగించి ప్రతిఘటిస్తారన్నది వాస్తవం. రాజ్యసభలో కంటే వారి బల ప్రయోగం లోక్‌సభలో అధికంగా వుంటుంది.

యాదవ త్రయం అభ్యంతరాలలో ప్రధానమైనది - మహిళలతో పాటుగా వెనుకబడిన తరగతులు, ముస్లిం మైనార్టీలకు కూడా రిజర్వేషన్ కల్పించాలన్న కోరిక. జనాభాలో అధిక శాతంలో వున్న బిసి, మైనార్టీలకు చట్టసభలలో వునికి లేకుండా పోతున్న మాట నిజం. మహిళా రిజర్వేషన్ వల్ల కూడా రాజకీయ కుటుంబ నేపథ్యం కల్గిన అగ్రవర్ణ మహిళలకు మాత్రమే అవకాశం దక్కుతుంది తప్ప, అణగారిన వర్గాల వారు సభలలో అడుగు పెట్టలేరు. అందువల్ల ఈ బిల్లులో మార్పు చేసి, బిసిలకు కూడా రిజర్వేషన్ కల్పించాలని పట్టుబడుతున్నారు వారు. మరోప్రక్క మూడోవంతు సీట్లు మహిళలకు రిజర్వు కావడం వల్ల దశాబ్దాల తరబడి పార్లమెంటు, శాసనసభలలో రాజకీయం చేస్తున్న పలువురు నేతలు ఎన్నికలలో పోటీ చేసే అవకాశం కోల్పోతారు. వారి సీట్లు రిజర్వు అయిపోతాయి. రాజకీయాలలో వారి అనుభవం, పలుకుబడి నిర్వీర్యమై పోతాయి. ఇందులో వచ్చే ఇంకొక సమస్య - మహిళలకు కేటాయించే సీట్లకు రొటేషన్ పద్ధతి పాటించాలనే నియమం పెట్టడం వల్ల ప్రతి ఎన్నికకు ప్రతి నియోజకవర్గంలో రిజర్వేషన్ మారిపోతుంది. దానితో ఏ చట్టసభ సభ్యుడు కూడా ఒకే నియోజకవర్గం నుంచి రెండు సార్లు పోటీ చేసే అవకాశం వుండదు.

ఇటువంటి సమస్యలను చట్టం రూపకల్పన సమయంలోనే పరిశీలనకు తీసుకొని వుంటే బాగుండేది. కానీ ఎందువల్లనో సోనియాగాంధీ బిల్లు ఆమోదానికి చూపిన శ్రద్ధ దానిలోని లోపాల సవరణకు చూపలేదు. లోక్‌సభలో దీనిపై చర్చ జరిపేటప్పుడైనా ఈ లోపాల సవరణకు ప్రయత్నం చేయడం అవసరం.

## జనవాణి

### మహిళా రిజర్వేషన్ బిల్లు ముదావహం!

ఎన్నాళ్ల నుంచో పెండింగ్‌లో వుండిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడంతో పాటు అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు రాజ్యసభలో ప్రవేశపెట్టడం ముదావహం. యుపిఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ ఈ బిల్లు ప్రవేశపెట్టడానికి ఎంతో కృషి చేశారు. ప్రతిపక్షపార్టీ అయిన బిజెపి కూడా దీనికి మద్దతివ్వడంతో మార్గం సుగమం అయ్యింది. ఈ బిల్లును వ్యతిరేకించి సమాజ్‌వాదీ , ఆర్జేడి పార్టీలు చరిత్ర హీనులయ్యాయి. ఈ బిల్లు వల్ల మహిళలకు మేలు జరుగుతుందని విశ్వసిస్తున్నారు.

పందిళ్లపల్లి అరుణమ్మ, నెల్లూరు

### దుస్థితిలో కోవూరు గ్రంథాలయం

జిల్లా గ్రంథాలయ సంస్థ యాజమాన్యంలోని శాఖా గ్రంథాలయాలన్నింటిలో మొట్టమొదట స్వంత భవనం సమకూర్చుకొన్న గౌరవం కోవూరు గ్రంథాలయానిది. 54 ఏళ్ల క్రితం జిల్లా గ్రంథాలయ సంస్థకు ఈ భవనాన్ని ఆధీనపర్చినప్పటికీ, సంస్థ నిరాదరణ వల్ల సేవలు కుంటుపడడమేగాక భవనం కూలిపోయే స్థితికి చేరుకోవడం విచారకరం. స్థానిక వదాన్యులు కొందరు భవన నిర్మాణానికి ముందుకొస్తున్నప్పటికీ గ్రంథాలయ సంస్థ చొరవ చూపించకపోవడం విచారకరం. ఇప్పటికైనా జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఈ విషయమై స్పందించాల్సి వుంది.

ఎన్.రామచంద్రారెడ్డి, చెన్నై

### నష్టపోయిన ఆంజనేయరెడ్డి!

రాజకీయపార్టీల్లో ఓ స్థాయి నేతలుగా ఎదిగిన వారంతా కొద్దోగొప్పో సంపాదించుకొంటారు. నెల్లూరు జిల్లాలో బిజెపి నేతలుగా ఎదిగిన వారిలో విశిష్ట వ్యక్తి వైసి.రంగారెడ్డి. బాగా నష్టపోయిన వ్యక్తి కర్నాటి ఆంజనేయరెడ్డి. పార్టీలో క్రియాశీలక వ్యక్తిగా, ధైర్యశాలిగా పేరు పొందినా ఆత్మకూరులో జరిగిన సంకుల రాజకీయ సమరంలో బి.సుందరరామిరెడ్డి చేతిలో ఓడిపోయింది మొదలు అన్నీ ఎదురుదెబ్బలే. ఇప్పటికైనా ఆయన సేవలు గుర్తించి పార్టీ జిల్లా అధ్యక్షుడిని చేసినందుకు సంతోషంగా వుంది. ఈ పదవిలో ఆయన రాణించాలని మనసారా కోరుకొంటున్నాను.

వాస్తు రామచంద్ర, నెల్లూరు

## 70 ఏళ్ల క్రితం ఈవారం

15-3-1940
పేజీలు : 16 వెల: అణా

### లండనులో హత్య

తూర్పు ఇండియా సంఘ సమావేశంలో మాజీ పంజాబు గవర్నరైన సర్ మైకేలు ఓ డయ్యరు గారు, జెల్లెండు ప్రభువు మున్నగు వారు కూర్చొని యుండగా, 37యేండ్ల వయస్సు గల మహమ్మదు సింగు అజాదు అను యువకుడు లోనికి వచ్చి రివాల్వరుతో కాల్చేను.

సర్ ఓ డయ్యరు మరణించినాడు. జెల్లెండు ప్రభువుకు గాయములు తగిలినవి. గతించిన డయ్యరు సేనాని యొక్క జలియనువాలా బాగ్ దురంతముల సమయమున పంజాబులో ఓ డయ్యరుగారు గవర్నరు పదవిలో వుండినారు.

### నెల్లూరు వార్తలు

#### సంత

వ్యవసాయ, పశువుల సంత రంగనాయకుల తిరునాళ్ల సమయంలో కందాడైవారితోటలో జరుగును. కమిటీవారు చాలా శ్రద్ధ వహిస్తున్నారు. ప్రదర్శనం 23-3-40 నుండి 27-3-40 వరకు జరుగును. ఈ యగ్జిబిషన్ ప్రారంభోత్సవం 21తేది జరుపడానికి మాజీమంత్రి రామనాథం గారిని ఆహ్వానించారు.

#### మునిసిపల్ సమావేశం

పై సమావేశం తే 11 దిన ఛైర్మన్ గారధ్యక్షతన జరిగింది.

నెల్లూరు జిల్లా ఎక్సయిజు ఆదాయం ఆరులక్షలు మాత్రమే అగుట చేతను, అన్ని జిల్లాల కన్నా ఎక్కువ వైశాల్యం కలిగియున్నందునను ఆరు తాలుకాలు మద్యనిషేధం ప్రవేశపెట్టబడి యుండే చిత్తూరు, కడప జిల్లాలను ఆనుకొని వుండుటవల్లను ఈ జిల్లాలో ప్రభుత్వం వారు మద్యనిషేధమును మరు సంవత్సరములో ప్రవేశపెట్టవలెనని తీర్మానించిరి.

## 50 ఏళ్ల క్రితం ఈవారం

11-3-1960
పేజీలు: 12 వెల: 0-3-0

### బత్తెన రామకృష్ణారెడ్డి హఠాన్మరణం

స్వాతంత్ర్య యోధుడు, కావలి శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రజాపార్టీ అధ్యక్షుడు బత్తెన రామకృష్ణారెడ్డి గారు హృద్రోగంతో, 10తేది ఉదయం కావలిలో హఠాత్తుగా మరణించారని తెల్పుటకు విచారిస్తున్నాము.

రామకృష్ణారెడ్డిగారు 9తేది హైదరాబాదు నుండి వస్తుండగా, ఒంగోలులో గుండెపోటు వచ్చిందనీ, అట్లనే కావలి చేరారని, అచ్చట 10 తేది వుదయం మరణించారని, వారి భౌతిక దేహం స్వగ్రామమైన అల్లూరుకు తీసుకరాబడి, నిన్ననే అంత్యక్రియలు జరుపబడినవని తెలుస్తున్నది. చనిపోవునప్పటికి రామకృష్ణారెడ్డిగారి వయస్సు 52 సంవత్సరాలు. రామకృష్ణారెడ్డి గారికి భార్య, ఒక కుమార్తె వున్నారు.

రామకృష్ణారెడ్డిగారు 1921 నాటి కాంగ్రెస్ వాది. 1930 ఉప్పు సత్యాగ్రహంలో బెజవాడ గోపాల రెడ్డిగారితోపాటు మొదటి జట్టులో అరెస్టు కాబడి, శిక్షింపబడిన వ్యక్తి. 1942 'క్విట్ ఇండియా' విప్లవంలో అల్లూరు పోలీస్ స్టేషన్‌ను తగులబెట్టి, రెండేళ్లు కారాగారవాసం అనుభవించిన యోధుడు. రాష్ట్ర కాంగ్రెస్ కార్యవర్గ సభ్యుడుగా జిల్లా బోర్డు సభ్యుడుగా, 1952 నుంచి శాసనసభ్యుడుగా జిల్లా రాజకీయాలలో ఒక ప్రముఖుడుగా వుంటున్న వ్యక్తి రామకృష్ణారెడ్డి. 1951లో ప్రజాపార్టీ స్థాపించింది మొదలు అందులోనే వుంటూ రాష్ట్ర ప్రజాపార్టీ అధ్యక్షుడుగా గూడా వ్యవహరించారు.

### యల్లాయపాళెం హరిజన నూత్న గృహప్రవేశం

సంక్షేమశాఖవారి ధన సహాయంతో పంచాయితీ అధ్యక్షులు ఆర్.వి.జి. కృష్ణారెడ్డి గారి కృషితో నిర్మాణమైన 34 హరిజన గృహాలకు, 4తేది చెరుకూరు పట్టాభిరామరెడ్డి గారు వేదోక్తంగా ప్రవేశోత్సవం జరిపారు. హరిజనాభ్యుదయానికి ప్రభుత్వం చేస్తున్న సహాయం; యీ గృహ నిర్మాణంలో ఆర్.వి.జి.కృష్ణా రెడ్డి గారు తీసుకున్న శ్రద్ధాసక్తులను గూర్చి, టీచరు చింతా నారాయణ వుపన్యసించి, కృతజ్ఞత వెల్లడించారు.

-ఒ.వి.

# దడదడలాడించిన ఎస్పీ!

▶ ఒకే రోజు సంఘ విద్రోహ కార్యకలాపాలపై దాడి


శెహబాష్ ఎస్పీగారు...

జిల్లా ఎస్పీ ఈతముక్కల దామోదర్ తన పనితీరును 7వ తేదీ ఒక్కసారిగా జూదగృహాలు, వ్యభిచార కేంద్రాలు, కోడి పందాల స్థావరాలపై దాడులు చేయించి సంఘ విద్రోహ శక్తులకు రుచి చూపించారు. ఆయన తన స్పెషల్ పార్టీలతో చేయించిన ఈ దాడులకు స్థానిక పోలీసులు సంజాయిషీ ఇచ్చుకోలేక పోయారు. గూడూరు కాస్మోపాలిటన్ క్లబ్బులో ఎప్పటి నుంచో పెద్దలు డబ్బులు పెట్టి పేకాడుతున్నారు. నెల్లూరులోని క్లబ్బులదీ అదే దారి. అతిథిగృహాల్లో నానా చండాలపు పనులు జరుగుతాయి. వ్యభిచారం, సింగిల్ నెంబర్లాట, క్రికెట్ బెట్టింగ్, వైట్ కాలర్ నేరాలు మామూలే. గొలగమూడి పెద్ద వ్యభిచార కేంద్రంగా మారింది. ఈ విషయాలన్నీ పోలీసులకు తెలుసు. కానీ వారు మామూళ్లు తీసుకొని గమ్మునుంటారు. ఈ విషయాలన్నింటిపై తనకొచ్చిన సమాచారాన్ని విశ్లేషించుకొన్న ఎస్పీ దామోదర్ శాంపిల్‌గా తన స్పెషల్ పార్టీని గూడూరులోని కాస్మోపాటన్ క్లబ్‌కు పంపితే 28 మంది జూదరులతోపాటు, 47వేల రూపాయలు, రెండు సెల్‌ఫోన్లు, ఏడు మోటారు సైకిళ్లు, ఒక కారు దొరికిపోయాయి. కావలి జడ్పీ పాఠశాలలోని జూదరులు ఈ విధంగానే దొరికిపోయారు. అనికేపల్లిలో కోడి పందాలరాయుళ్లు, ఇందుకూరుపేటలోని పేకాటరాయుళ్లు, గొలగమూడిలోని వ్యభిచారులను గతంలో నెల్లూరు వన్‌టౌన్ ఎస్ఐగా వుండిన ఇప్పటి ఎస్పీ స్పెషల్ పార్టీ ఎస్ఐ శ్రీనివాసన్ ఒక్కసారిగా పట్టి తన సత్తా చూపారు. నెల్లూరు సిఐ వీరాంజనేయరెడ్డిపై ఎస్పీ నమ్మకముంచి నగరంలో ఆయన చేత దాడులు జరిపించగా మహిళా పాలిటెక్నిక్, గాంధీబొమ్మ ప్రాంతాల్లో పేకాట ఆడుతూ పలువురు దొరికిపోయారు. ఈ దాడులు ఇటు సంఘ విద్రోహులతోపాటు లంచాలకు అలవాటు పడిన పోలీసులను దడదడలాడించాయి. ఎస్పీ ఇదే ఉత్సాహంతో పనిచేస్తే జిల్లాలో అదుపు తప్పిన పరిస్థితులు చక్కబడతాయి.

# ఉపాధిహామీ పనులకు 52 కోట్లు!



ఉపాధిహామీ పథకం ఊపందుకొనేనా?

ఈ ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు 52 కోట్ల రూపాయలు కేటాయించారు. జిల్లాలో ఇప్పటివరకు ఈ పథకం క్రింద వెయ్యి పనులు ప్రతిపాదించబడి వున్నాయి. ప్రభుత్వం విడుదల చేసే నిధులతో నిర్దేశించిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, ధరల ప్రకారం అంచనాలు రూపొందించి తదుపరి సాంకేతికపరమైన అనుమతులు తీసుకోవాల్సి వుంటుంది. పనులకు సంబంధించిన ధరల విషయంలో చాలా వ్యత్యాసం వుండడం ప్రభుత్వ దృష్టికి వెళ్లింది. స్థానిక సంస్థలకు అధికారం ఇవ్వడంతో ఉపాధిహామీ ద్వారా చేపట్టే ప్రతి పనికి జడ్పీ ఛైర్మన్ నుంచి ముందుగా అనుమతి పొందాల్సి వుంటుంది. దీనికి తోడుగా ఇక నుంచి పనుల వివరాలు, ధరలను కంప్యూటర్లలో నమోదు చేసి ఆన్‌లైన్‌లో వుంచాల్సి వుంటుంది. అన్ని మండలాల్లో జరుగుతున్న పనులు కంప్యూటరీకరణ చేయడం వల్ల ఎప్పటికప్పుడు అన్ని విషయాలు తెలుసుకోవీలవుతుందంటున్నారు. గతంలో మాదిరిగా ఈ పథకం ద్వారా చేపట్టే పనులలో నిధుల దుర్వినియోగం జరగకుండా అన్ని చర్యలు తీసుకొంటున్నారు. పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికార్ల నిత్యపర్యవేక్షణలో వుండేవిధంగా ప్రణాళికను రూపొందిస్తున్నారు.

# పకడ్బందీగా టెన్త్ పరీక్షలు!

ఈ నెల 23వ తేది నుంచి జరుగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. గతంలో పరీక్షల నిర్వహణకు నియమించిన ఇన్విజిలేటర్లను ఈ యేడాది అవే పరీక్షా కేంద్రాలలో నియమించకుండా వుండేందుకు జిల్లా విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. దీనికోసం జిల్లా విద్యాశాఖాధికారి, జడ్పీ సిఇఓల సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపడతారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రధాన గేట్లకు తాళాలు వేసి తనిఖీ అధికారులు లోపలికి రాకుండా చేసేవారు. గేట్లకు తాళాలు వేయకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అదేవిధంగా సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి పరీక్షలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నారు. జిల్లాలో పదవ తరగతి పరీక్ష వ్రాసే 31,037 మంది రెగ్యులర్, 6,593 మంది ప్రైవేట్ విద్యార్థుల కోసం 180 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ కోత లేకుండా చూడడంతోపాటు విద్యుత్ సర్వీసు లేని పాఠశాలలను గుర్తించి విద్యుత్ సరఫరా అందించడంతోపాటు విద్యార్థులకు అవసరమైన ఫర్నీచర్‌ను సమకూర్చనున్నారు. గతంలో మాదిరి జడ్పీ పాఠశాలల్లో చదివి పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు తెచ్చుకొన్న విద్యార్థులకు జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రోత్సాహక బహుమతులిస్తారు. ఇతర పాఠశాలల్లో చదివి పరీక్షా సమయంలో జడ్పీ స్కూళ్లలో చేరే వారికి ఈ బహుమతులు ఇవ్వకూడదని ఛైర్మన్ ఈసారి విధానపరమైన నిర్ణయం తీసుకొన్నారు.


పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులు. (ఫైల్‌ఫోటో).

# అంగన్‌వాడీలకు జడ్పీ నిధులు

జిల్లాలో స్త్రీ, శిశుసంక్షేమ శాఖ కార్యక్రమాల కోసం నిర్దేశించిన పనులకు జిల్లా పరిషత్ నుంచి నిధులు కేటాయించనున్నారు. ఇందిరమ్మ పథకం అమలయ్యే గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణాలకు ప్రభుత్వం మొదటి విడతగా 80 కేంద్రాలు నిర్మించేందుకు అనుమతినిచ్చింది. ఈ భవనాల నిర్మాణం కోసం ఒక్కొక్క దానికి రెండు లక్షల 85వేల రూపాయలు నాబార్డు నుంచి నిధులు విడుదలయ్యాయి. నాబార్డు నుంచి విడుదలైన నిధులకు జడ్పీ నుంచి కూడా నిధులను అనుసంధానం చేస్తారు. జిల్లా పరిషత్ నుంచి ఒక్కొక్క అంగన్‌వాడీ కేంద్ర భవనానికి 15 శాతం నిధులు విడుదల చేయనున్నారు. ఈ బాటలో రెండవ విడతన 115 అంగన్‌వాడీ కేంద్ర భవనాలు నిర్మించేందుకు అనుమతి లభించింది. దీనికి అవసరమైన పూర్తి అంచనాలతో కూడిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాల్సి వుంటుంది. ఇప్పటికే అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాల జాబితాను పంపాలని జడ్పీ నుంచి ఉత్తర్వులు అందినా ఆ శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దేవుడు వరమిచ్చినా పూజారి ఇవ్వలేదన్న సామెత ఈ వ్యవహారంలో అచ్చుగుద్దినట్లు సరిపోతుంది.


జిల్లా పరిషత్‌కు మరిన్ని నిధులు

# వసూల్ రాజాలుగా ట్రాఫిక్‌పోలీసులు!



అదుపులేని ట్రాఫిక్ పోలీసులు.

ట్రాఫిక్ పోలీసుల వసూళ్లకు అంతే లేకుండా పోతోంది. టౌన్‌బస్సుల నుంచి నెల మామూళ్లు దండుకొంటున్న వాళ్లు ఆటోవారి నుంచి అదిరించి బెదిరించి నగదు వసూళ్లు చేస్తున్నారు. రశీదు వ్రాస్తే 1000 లేకుంటే 200 నుంచి 500 రూపాయలు గుంజుకుంటున్నారు. మద్రాస్ బస్టాండు, ట్రంకురోడ్డు, ఆత్మకూరు బస్టాండ్ వద్ద వుండే పండ్ల వ్యాపారులు రోజూ మామూళ్లు ఇవ్వాలి. షిఫ్ట మారినప్పుడల్లా కానిస్టేబుళ్లు వచ్చి ఠంచనుగా తమకు రావాల్సింది వసూలు చేసుకొంటున్నారు. ఆత్మకూరు బస్టాండు వద్ద కోవూరు, బుచ్చికి పోయే వాహనాలు నిలిపే ప్రదేశంలో ట్రాఫిక్ కానిస్టేబుళ్ల బెదిరింపులకు పాల్పడుతున్నారట. ఇక్కడ నాలుగు చక్రాల పెద్ద ఆటోల్లో ప్రయాణీకులను ఎక్కించుకొని బుచ్చి రూటులో తిరుగుతుంటారు. ఈ వాహనాల నుంచి ట్రిప్పుకు 20 రూపాయలు వసూలు చేస్తున్నారట పోలీసులు. ముగ్గురు కానిస్టేబుళ్లు ఈ పెద్ద ఆటోలకు వరుస నెంబర్లు కేటాయించడంతోపాటు ప్రతి ట్రిప్పును లెక్కిస్తూ పుస్తకంలో నమోదు చేస్తుండడంతో చూసినవారు విస్తుపోతున్నారు. వీరిలో వీరికే ఒకరిపై ఒకరికి అనుమానం వుండడంతో వాహనాల డ్రైవర్ల నుంచి ఎన్ని ట్రిప్పులు తిరిగావు ఎంత ఇచ్చావు అని ఎంక్వయిరీ జరుగుతుండడంతో రోజుకు ఒక్కో వాహనదారుడు 200 రూపాయలకు పైగానే చెల్లించాల్సి వస్తోంది. ఇంత బహిరంగంగా వసూళ్లకు పాల్పడుతున్న ట్రాఫిక్ కానిస్టేబుళ్లపై ఎస్పీ దృష్టి సారించి డిపార్టుమెంటు పరువు నిలపాల్సి వుంది.

# అటకెక్కిన ప్రైవేటు ఆస్పత్రుల రిజిస్ట్రేషన్!

**రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.నెం.138 ప్రకారం క్లినిక్స్, నర్సింగ్ హోమ్స్, ల్యాబ్స్ నిర్వహించేవారు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. కాని అలా చేయించుకొన్న వారు చాలా తక్కువ.**

ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రభుత్వం జిఓ జారీ చేసి రెండు సంవత్సరాలు కావస్తుంది. అయినప్పటికి ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం స్పందించడం లేదు. వైద్యం పేరిట చేస్తున్న దోపిడి ఈ జిఓ ద్వారా ఎక్కడ బట్టబయలు అవుతుందోనని యాజమాన్యాలు భయపడుతున్నాయి. ఒకప్పుడు వైద్యవృత్తిని చేపట్టినవారు సేవాభావంతో తమ దగ్గరకు వచ్చిన రోగులకు వైద్య సేవలు అందించేవారు. ప్రస్తుతం వైద్య వృత్తి అంటేనే వ్యాపారవృత్తిగా భావిస్తున్నారు. నెల్లూరు నగరంతోపాటు కావలి, గూడూరు ప్రాంతాల్లో రోజుకొక వైద్యశాల వెలుస్తున్నది.

రాష్ట్ర ప్రభుత్వం 2008 సంవత్సరంలో (జిఓ.ఎంఎస్ నెం–138)ని జారీ చేయడం జరిగింది. ఈ యాక్టు ప్రకారం క్లినిక్స్, ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, ల్యాబ్‌లను నిర్వహించేవారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఫీజు, ఆపరేషన్ల వివరాలు, రూము అద్దెలను ఎంత వసూలు చేస్తున్నారో బోర్డుల ద్వారా తెలియజేయాల్సి వుంటుంది. అయితే ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను కొన్ని ఆసుపత్రులు పాటిస్తుండగా మరి కొన్ని ఆసుపత్రులు పాటించడం లేదు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రైవేటు ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ కోసం ఒక విభాగాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఫీజులు, ఆపరేషన్లకు వసూలు చేసే నగదు వివరాలు బహిర్గతం చేస్తే ఎక్కడ తమ వ్యాపారాలు దెబ్బతింటాయోనని వైద్యులు భయపడుతున్నారు.

ఆసుపత్రులకొచ్చే రోగుల అవసరం, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వేలాది రూపాయలు బిల్లుల రూపంలో నిర్వాహకులు గుంజుతుంటారు. ప్రైవేటు ఆసుపత్రులు, వైద్యుల పనితీరుపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించే పరిస్థితి లేదు. దీంతో వైద్యులు ఇష్టానుసారంగా ఆపరేషన్ల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేసుకోగలుగుతున్నారు. అనారోగ్యంతో ప్రైవేటు వైద్యశాలల్లో చేరిన వారికి అవసరమైన వైద్యం అందక చనిపోయినవారు అనేక మంది వున్నారు. వైద్యుల నిర్లక్ష్యం, అడిగినంత ఫీజు చెల్లించలేదన్న కారణంతో నామమాత్రపు వైద్యం అందించేవారు నగరంలో అనేక మంది వున్నారు. ఆసుపత్రులలో మరణించిన రోగి బంధువులు, వైద్యులకు ఘర్షణలు జరిగిన సందర్భాలు అనేకం వున్నాయి. పోలీసు కేసు నమోదు కాకుండా పలుకుబడి వుపయోగించి రాజీ చేసుకుంటున్నారు.

ఇటువంటి సంఘటనలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసింది. రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిఓ జారీ చేసిన ప్రభుత్వం అమలు చేసే విషయంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. జిఓ జారీ చేసి రెండు సంవత్సరాలు కావస్తున్నా 30 శాతం కూడా నమోదు కాలేదంటే అధికార యంత్రాంగం ఎలా విధులు నిర్వహిస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా ఎన్ని ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. ఎన్ని రిజిస్ట్రేషన్లు జరిగాయన్న పూర్తి వివరాలు అధికారుల వద్ద లేవు. రిజిస్ట్రేషన్‌కు నిర్ణీత



ప్రేక్షకపాత్ర పోషిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం.

గడువు విధించకపోవడంతో కాలయాపన జరుగుతుంది.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కూడా రిజిస్ట్రేషన్ వ్యవహారంపై చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వున్నాయి. దీంతో ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా తప్పించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆసుపత్రులలో ప్రజలకు వుపయోగపడే విధంగా ఫీజుల నియంత్రణ చేయడంతోపాటు రిజిస్ట్రేషన్‌పై గట్టిచర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది.

● అన్నింటా విఫలమైన

# విత్తనాభివృద్ధి సంస్థ!

**రైతాంగానికి అవసరమైన విత్తనాలు అందించేందుకు ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ జిల్లాలో ఆశించిన ఫలితాలను సాధించలేకపోయింది.**

జిల్లా రైతాంగానికి అవసరమైన వరి విత్తనాలను అందించేందుకు ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ ఆశించిన ఫలితాలను సాధించలేక పోతున్నది. మన జిల్లాలో అధికంగా వరి విత్తనాలకు డిమాండ్ వుంటుంది. రైతుల నుంచి వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో వుంచుకొని ఆ దిశగా విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు కృషి చేయలేక పోతున్నారు. ప్రతి సంవత్సరం రబీ, ఖరీఫ్ సీజన్‌లకు సంబంధించి ఏ రకం వరి విత్తనాలను నాటాలో తెలియని పరిస్థితిలో రైతులు అధికారుల చుట్టూ తిరుగుతుంటారు. అయితే ఈ సంస్థ అధికారులు గానీ, వ్యవసాయశాఖ అధికారులు గానీ సరైన సమాచారం అందించడంలో విఫలం చెందుతున్నారు.

## అధికారుల్లో నిర్లక్ష్యం!

రబీ, ఖరీఫ్ సీజన్‌లలో ఎన్ని ఎకరాల్లో వరిపంట సాగవుతుందన్న విషయాన్ని ముందుగా వ్యవసాయశాఖ గుర్తించాల్సి వుంటుంది. గుర్తించిన ప్రాంతాల్లో ఏ రకం వరి విత్తనాలను వేయాలో నిర్ధారించి అందుకు అవసరమైన విత్తనాలను సరఫరా చేయాలని విత్తనాభివృద్ధి సంస్థ అధికారులకు తెలియజేయాలి. దీంతో జిల్లాలో గుర్తించిన రైతుల నుంచి అవసరమైన వరి విత్తనాలను సేకరిస్తుంటారు. రైతుల అవసరాలకు జిల్లాలో వరి విత్తనాలు లభ్యం కాకుంటే ఇతర జిల్లాల నుంచి కూడా సేకరిస్తుంటారు. అయితే విత్తనాభివృద్ధి సంస్థ, వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సకాలంలో విత్తనాలు సరఫరా కాక పోవడంతో వ్యాపారస్తుల వద్ద కొను గోలు చేయాల్సిన పరిస్థితి వుంటుంది.

## నష్టపోయిన రైతులు

గత అక్టోబరు నెలలో జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు పైగా వరి నాట్లు వేయడం జరిగింది. వరి నాట్లు వేసే ముందు రైతులకు అవసరమైన విత్తనాలను విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు సేకరించి సిద్ధం చేయలేక పోయారు. దీంతో రైతులు బయట వ్యాపారస్తుల వద్ద అధికధరలకు కొనుగోలు చేశారు. వ్యాపారస్తుల వద్ద కొనుగోలు చేసిన విత్తనాలు కొన్ని ప్రాంతాల్లో మొలకెత్తలేదు. నాసిరకం విత్తనాలు విక్రయించడం కారణంగా అనేక మంది రైతులు ఆర్థికంగా ఎంతో నష్టపోవాల్సి వచ్చింది. నాసిరకం విత్తనాలను విక్రయించిన వ్యాపారస్తులపై చర్యలు మాత్రం ఇప్పటివరకు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

జిల్లా వ్యవసాయ శాఖ, విత్తనాభివృద్ధి సంస్థ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం కారణంగా రైతులు అనేక ఇబ్బందులు పడడంతోపాటు నష్టాలను సైతం చవిచూడాల్సి వస్తుంది. రైతులకు అవసరమైన సమయంలో విత్తనాలు సరఫరా చేయలేని అధికారులు తర్వాత సేకరించిన విత్తనాలను ధాన్యం రూపంలో విక్రయించు కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గత అక్టోబర్ నెలలో 1001, బిపిటి 1010, 204, ఐఆర్ 64, ఎంపిటి 1010, జెజెఎల్ 1798, 384, ఎడిటి 37, 39, 43, సిఆర్ 1009, ఎన్ఎల్ఆర్ 33, 39, 76, 94, ఎన్ఎల్ఆర్ 145 తదితరరకాల వరివిత్తనాలను విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు సేకరించగలిగారు.

గుర్తించిన రైతుల నుంచి ఒక్కో రకం విత్తనాలను సేకరించి

కొరవ 14వ పేజీలో

శ్రీసాయి డయాబిటీస్ సెంటర్
సాయిబాబా మందిరం వీధి, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్ : 2329572
12వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

డా॥ సి.మల్లికార్జున్
M.B.B.S., MDRC. (Chennai)
షుగర్ వ్యాధి నిపుణులు
గత పన్నెండు సంవత్సరాలుగా నెల్లూరులో చక్కెర వ్యాధికి చక్కనైన వైద్యం అందిస్తూ, అందరికీ అందుబాటులో వున్న
డా॥ సి.మల్లికార్జున్
శ్రీమతి శార్వాణి మల్లికార్జున్ M.Sc.
శ్రీసాయి డయాబిటీస్ సెంటర్
15-03-2010
12వ వార్షికోత్సవం సందర్భంగా
వారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు
దుగ్గిశెట్టి ఉమామహేశ్వరరావు, దర్గామిట్ట
చీమకుర్తి కేశవులు శెట్టి, నవాబుపేట

# కావలిలో కిరోసిన్ అక్రమవ్యాపారం!

**• లక్షాధికారులవుతున్న రేషన్ డీలర్లు**

కావలి మండలంలో కిరోసిన్ అక్రమ వ్యాపారం నిరాటంకంగా కొనసాగుతుంది. పేదల కోసం ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా అందించే నీలి కిరోసిన్‌ను కొందరు రేషన్‌షాపు డీలర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలించి అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రభుత్వం లీటరు 9.75కు అందించే కిరోసిన్‌ను నల్లబజారులో 30రూపాయలకు అమ్మి వ్యాపారులు సొమ్ము చేసుకొంటున్నారు. కావలి రూరల్, పట్టణ ప్రాంతాల్లో మొత్తం 36వేల రేషన్‌కార్డులు వున్నాయి. నెలకు 93,034 లీటర్ల కిరోసిన్‌ను ప్రజాపంపిణీ ద్వారా విక్రయిస్తున్నారు. గతంలో ఒక్కో కార్డుకు 3లీటర్లు ఇస్తుండగా, ఫిబ్రవరి నెల నుంచి పట్టణాల్లో నాలుగు లీటర్లు, గ్రామాల్లో రెండు లీటర్లు సరఫరా చేస్తున్నారు. బియ్యంతోపాటు కిరోసిన్ రేషన్ షాపులకు చేరకపోవడం, ఆలస్యం కావడంతో వినియోగదారులు సక్రమంగా కిరోసిన్ తీసుకోకపోవడంతో డీలర్ల పని సులువవుతోంది. గ్యాస్ కనెక్షన్ వున్నవారు కిరోసిన్ కొనకపోవడంతో రేషన్‌షాపు నిర్వాహకులు వాటిని లీటర్ 26 రూపాయల లెక్కన అక్రమ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ అక్రమవ్యాపారాన్ని అధికారులు అరికట్టాల్సివున్నా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో కావలి ప్రాంతంలో నీలి కిరోసిన్ డీలర్లకు కాసులు కురిపిస్తోంది.



ధరల పెరుగుదలను నిరసిస్తూ సిపిఎం నేతృత్వంలో నెల్లూరు మద్రాసు బస్టాండ్ వద్ద రాస్తారోకో చేస్తున్న దృశ్యం.

## మారని గిరిజన బతుకులు

**• ఇందుకూరుపేటలో అందని ప్రభుత్వ ఫలాలు**

గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ వివిధ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ అవి వారి దరిచేరడం లేదు. ఇందుకూరుపేట మండలంలోని గిరిజనులే దీనికి ఉదాహరణ. రాష్ట్రవ్యాప్తంగా పేదలకు లక్షలాది పక్కాగృహాలు నిర్మిస్తున్నా మండలంలోని అమాయక గిరిజనులు మాత్రం పూరిగుడిసెల్లోనే నివసిస్తున్నారు. గంగపట్నం చెరువుగట్టుపై 30 కుటుంబాలున్నాయి. వీరు కూలీపనులు, చేపల వేటపై ఆధారపడి జీవనం సాగించేవారే. వీధి దీపాలు లేకపోవడం, పక్కాగృహాలు అందకపోవడంతో ప్రభుత్వ ఫలాలకు ఆమడ దూరంగా బ్రతికేస్తున్నారు. పిచ్చుకగూళ్ల లాంటి ఇళ్లలో జీవనం సాగిస్తున్న వీరి గురించి అధికారులకు పట్టకపోవడంతో ఏ ప్రభుత్వ పథకం వీరి జీవితాలను మెరుగుపరచేందుకు ఉపయోగపడకుండాపోతుంది.

## పాపిరెడ్డిపాళెంలో భూవివాదం!

తోటపల్లిగూడూరు మండలంలోని పాపిరెడ్డిపాళెంలో భూవివాదం తహశీల్దార్ లక్ష్మీనారాయణ, సిపిఎం నారాయణలకు మధ్య వివాదంగా మారింది. ఈ ప్రాంతంలో గల 12 ఎకరాల భూమిని పేదూరు, ఇస్కపాళెంలోని దళితులకు పంచి పెట్టాలని చాలాకాలంగా సిపిఎం డిమాండ్ చేస్తుంది. కోర్టు వరకు ఈ వివాదం వెళ్లింది. తహశీల్దార్ న్యాయంగా వ్యవహరించకుండా అధిక మొత్తంలో ముడుపులు అందుకొని పెద్దలకు కట్టబెట్టాడని వారు ఆరోపిస్తున్నారు. పేదలకు ఇవ్వాల్సిన భూములు ప్రభుత్వానివి కావని, ప్రైవేట్ వ్యక్తులవని తప్పుడు నివేదిక ఇచ్చాడని పేదలు ధ్వజమెత్తారు. తహశీల్దార్ వైఖరిని నిరసిస్తూ రెవిన్యూ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. కాసులకు కక్కుర్తిపడి పేదలకు అన్యాయం చేస్తావా అంటూ తిట్లదండకం విన్పించడంతో ఆ దెబ్బకు తహశీల్దార్ బిత్తరపోయాడు. ఇంత జరిగినా తనకేమీ తెలియనట్లు ఆయన వ్యవహరించడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

**• నాయుడుపేట హాస్పిటల్‌లో**

## నేలపైనే రోగులు

నాయుడుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస వసతులు లేకపోవడంతో రోగులు పలు ఇబ్బందులు పడాల్సివస్తోంది. మంచాలు సక్రమంగా లేకపోవడంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకొన్నవారు నేలపైనే పడుకోవాల్సిన దుర్గతి పట్టింది. ఆస్పత్రిలో వున్న ఇనుప మంచాలన్నీ మరమ్మత్తులకు గురైవుండడం, ఒకటి అరా బాగున్నా పడుకొనేందుకు వీలుగా లేకపోవడంతో ఆపరేషన్లు చేయించుకొన్న మహిళలు కటిక నేలపైనే సేద తీరాల్సి వస్తోంది.

### సర్కారు దవాఖానా బాగుపడదా?

ఆస్పత్రి అభివృద్ధికి నిధులు మంజూరైనా అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో ఈ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చే మహిళలకు నరకం కనిపిస్తోంది. ఇటీవల మెగాక్యాంపు నిర్వహించి పెళ్ళకూరు, నాయుడుపేట, ఓజిలి, చిట్టమూరు మండలాల పరిధిలోని 28 మందికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేశారు. డిప్యూటి డిఎంహెచ్ఓ పెంచలసుబ్బమ్మ నేతృత్వంలో జరిగిన ఈ ఆపరేషన్లను చేయించుకొన్న మహిళలందరూ వరుసగా నేలపైనే పడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.


నెల్లూరు మద్రాసు బస్టాండ్ వద్ద గల ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో మంచినీటి ఫిల్టర్లను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి.



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరు గాంధీబొమ్మ వద్ద మహిళా సమైక్యతను చాటిచెబుతున్న జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్లపల్లి అరుణమ్మ బృందం.

## బోగోలులో ఆగని నాటుసారా తయారీ!

బోగోలు మండలంలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా కాపుసారా తయారవుతోంది. మండలంలోని పలు ప్రాంతాల్లో సారా తయారుచేస్తున్నారు. ఏ ఊరిని పరిశీలించినా, ఏ వీధిలో చూసినా సారాయితోపాటు బ్రాందీ బెల్టుషాపులు విచ్చలవిడిగా కన్పిస్తుంటాయి. కాపుసారా అమ్మకాలపై స్థానిక పోలీసులకు సమాచారం అందినా ఆవైపు కన్నెత్తి చూడడం లేదు. సారా తయారీదారుల నుంచి నెల మామూళ్లు అందుతుండడంతో పోలీసులు మౌనంగా వుంటున్నారనే విమర్శలు పెద్ద ఎత్తున వినవస్తున్నాయి. దీనికి తోడు

### స్పందించని పోలీసు

గ్రామ గ్రామాన బెల్టుషాపులు ఏర్పడడంతో మద్యం మత్తులో మందుబాబులు చేస్తున్న గొడవలతో విసిగిపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఇటీవల బిట్రగుంట పోలీసులకు సమాచారం అందించినా స్పందించకపోవడంతో అక్రమార్కుల ఆగడాలకు అంతేలేకుండా పోయింది. క్రొత్తగా వచ్చిన ఎస్పీ అయినా బెల్టుషాపులు, సారా విక్రయాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుకొంటున్నారు.


కేరళలోని త్రిసూర్‌లో జరిగిన నెహ్రూ యువకేంద్ర నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌లో బహుమతి పొందిన నెల్లూరు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీ మోహన్‌రాజుకు జ్ఞాపికను అందజేస్తున్న నెహ్రూ యువకేంద్ర త్రివేండ్రమ్ జోనల్ డైరక్టర్ ఎస్.నరేష్.

# అసంపూర్తిగా మంచినీటి పథకాలు

**• గూడూరు డివిజన్‌లో పరిస్థితిది**

గ్రామీణ ప్రాంతాలకు మంచినీటిని సరఫరా చేసే విభాగానికి నిధుల కొరత శాపమైంది. సకాలంలో కాంట్రాక్టర్‌లకు బిల్లులు చెల్లించలేకపోవడంతో మూడు కోట్ల రూపాయలు బకాయిపడింది. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ బకాయి వుండడంతో కాంట్రాక్టర్లు నిర్మాణాలను అసంపూర్తిగా వదలివేయడంతో ప్రజలకు ఈ వేసవిలో తిప్పలు తప్పేట్లు లేవు. గూడూరు డివిజన్‌లో 30 మంచినీటి పథకాల పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఈ పనులు పూర్తి కావాలంటే 1.5 కోట్లు బిల్లులు చెల్లించాల్సి వుంది. నెల్లూరు డివిజన్‌లోనూ అంతేమేర బకాయిలు వున్నాయి. డిసెంబర్ నెలలోనే గ్రాంట్ మంజూరు అయినప్పటికీ బిల్లులు చెల్లింపులో జాప్యం జరగడంతో పనులకు ఆటంకం ఏర్పడింది. సూళ్లూరుపేట ప్రాంతంలోని గ్రద్దగుంట, చేనిగుంట, దొరవారిసత్రం మండలం కొత్తపల్లి, నెలబల్లి, కట్టువపల్లి తదితరచోట్ల మంచినీటి పథకాల పనులు నిలిచిపోయాయి. వేసవి ముదురుతున్న తరుణంలో జిల్లాలో అనేక ప్రాంతాల్లో ప్రజలు మంచినీటి కోసం అవస్థలు పడాల్సిన స్థితి అధికారుల వైఫల్యం వలన ఏర్పడడం విచారకరం. వేసవిని దృష్టిలో వుంచుకొని అధికారులు తగిన ఏర్పాట్లు చేయాల్సి వుంది.




నెల్లూరు టౌన్‌హాల్‌లో పౌరహక్కుల సంఘం నేతృత్వంలో జరిగిన ఆజం అలి సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి క్రాంతి చైతన్య. ప్రక్కన జిల్లా పౌరహక్కుల సంఘం నేత వెంకటేశ్వర్లు వున్నారు.

# క్రీడా మైదానాలకు ఉపాధి హామీ నిధులు!

**మంచి జరిగేనా?**

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం క్రింద వచ్చే నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో పలు పాఠశాలల సమస్యలు కొంతవరకు తీరనున్నాయి. ముఖ్యంగా మైదానాలు అభివృద్ధి చేయనుండడంతో విద్యార్థులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కలువాయి మండలానికి సంబంధించి 69లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాఠశాలల క్రీడా మైదానాలను తీర్చిదిద్దేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మండలంలో 54 ప్రాథమిక పాఠశాలలు, 11 ప్రాథమికోన్నత పాఠశాలలు, 5 ఉన్నత పాఠశాలలు వున్నాయి. ఈ పాఠశాలల్లో వున్న మైదానాలు కంపచెట్లతో నిండి వున్నాయి. క్రీడలకు పనికి రాకుండా వున్న ఈ మైదానాలకు ఇక గ్రహణం వీడనుంది. ఉపాధిహామీ నిధులతో వీటికి మహర్దశ పట్టనుంది. ఈ నిధులే కాకుండా పంట కాలువలు, రింగురోడ్లు తదితర అభివృద్ధి పనుల కోసం 1.5 కోట్లకు ప్రాతిపాదనలు పంపినట్లు అధికారులు చెప్పున్నారు. మొత్తం మీద పిల్లలకు క్రీడామైదానాలు అందుబాటులోకి రానున్నాయి.

# పంచాయితీ బకాయిలు

జిల్లా వ్యాప్తంగా పంచాయితీలకు పన్నుల రూపేణా ప్రజల నుంచి రావాల్సిన కోట్ల రూపాయల బకాయిలు పేరుకపోతుండడంతో అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. మొత్తం 969 పంచాయితీలు వుండగా అందులో 42 మేజర్ పంచాయితీలు, 927 మైనర్ పంచాయితీలు వున్నాయి. ప్రజల నుంచి ప్రతి సంవత్సరం ఇంటి పన్నులు, కొళాయి, బిల్డింగ్ పన్నుల ద్వారా వచ్చే మొత్తాలను వసూలు చేయాల్సి వుంది. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతోపాటు పన్నుల రూపంలో వసూలైన వాటితో గ్రామాల్లో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు ఖర్చు చేయాల్సి వుంది. పన్నుల రూపంలో 21కోట్లు రావాల్సివుండగా ఇప్పటివరకు షుమారు 11కోట్లు మాత్రమే వసూలైనాయి. సిబ్బంది కొరత పన్నుల వసూళ్లపై ప్రభావం చూపుతోంది. బిల్ కలెక్టర్ పోస్టులు ఖాళీగా వున్నాయి. 969 పంచాయితీల్లో కేవలం 11 మంది బిల్ కలెక్టర్లు వున్నారు. పర్మినెంట్ ఉద్యోగుల పోస్టులు ఖాళీగా వుండడంతో పన్నుల వసూళ్ల బాధ్యతా జూనియర్ అసిస్టెంట్లు, స్వీపర్లపై పడుతోంది. పన్నుల వసూళ్లు కాకపోవడంతో గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు నిలచిపోతున్నాయి.

# కాళంగిలో ఇసుక అక్రమరవాణా

కాళంగినదిలో గత కొంతకాలంగా స్తబ్దుగా వున్న ఇసుక అక్రమ రవాణా తిరిగి ఊపందుకొంది. పగలు రాత్రి అనే తేడా లేకుండా ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో ఇసుక తరలిపోతోంది. నదిలోకి నీళ్ల రావడంతో ఇటీవలకాలంలో తగ్గుముఖం పట్టిన ఇసుక అక్రమ రవాణా నీటిమట్టం తగ్గడంతో స్మగ్లర్లు తిరిగి విజృంభించారు. ఇసుక తరలింపుకు వచ్చే వాహనాలతో నదిలో జాతర వాతావరణం నెలకొంది. రోజూ 50 నుంచి 70 ట్రాక్టర్లలో ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం. ఈ రవాణా వలన కాళంగినదిలో 2 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన సర్ఫేస్ డ్యాంలు దెబ్బతినిపోతున్నాయి. ఉప్పునీరు నదీ గర్భం నుంచి అవతలి వైపునకు వెళ్లకుండా వుండేందుకు నిర్మించిన మూడు సర్ఫేస్ డ్యాంలు పగిలిపోయాయి. దీంతో ఉప్పునీరు నది అంతా విస్తరించడంతో సమీప ప్రాంతాల్లోని బావులు, బోర్లలో వచ్చే నీటిలో ఉప్పునీటి శాతం పెరిగిపోతున్నట్లు శాస్త్రవేత్తలు చెప్పున్నారు. కాళంగి వంతెనలకు ముప్పు ఏర్పడింది. యదేచ్ఛగా ఇసుక అక్రమరవాణా జరుగుతున్నా రెవెన్యూ, పోలీసుశాఖలు మామూళ్ల మత్తులో మునగడంతో ఇసుక స్మగ్లర్లది ఇష్టారాజ్యమయ్యింది.

# రోడ్డున పడ్డ విద్యార్థులు!

**అధికారుల మధ్య సమన్వయ లోపమే కారణం**

అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం, అహడావుడి నిర్ణయాల ఫలితంగా విద్యార్థులు రోడ్డున పడాల్సిన పరిస్థితి నాయుడుపేట మండలంలో ఎదురైంది. మండలంలోని ఎల్‌ఎ సాగరంలోని ప్రాథమికోన్నత పాఠశాలను 2003లో ఉన్నతపాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. తగిన భవన వసతి లేనందున స్కూలు ప్రక్కనే వున్న సహకార గోడౌన్లలో పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ షుమారు 500 మందికి విద్యార్థులు చదువుకొంటున్నారు. ఇన్ని సంవత్సరాలపాటు గమ్మిగా వున్న సహకారశాఖ ఉన్నట్లుండి పాఠశాలను ఖాళీ చేయాలని చెప్పి ఒత్తిడి చేయడంతో పాపం విద్యార్థులందరూ రోడ్డున పడాల్సివచ్చింది. మండుటెండలో ఆరుబయటే తరగతులను నిర్వహించాల్సి రావడంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కొందరి నేతల మాటలు నమ్మి గోడౌన్లో పాఠశాలను ఏర్పాటుచేస్తే ఇప్పుడు ఖాళీ చేయించడం ఏమిటని దీని వలన ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురౌతున్నారని తల్లిదండ్రులు, స్థానికులు ఆగ్రహం వెలిబుస్తున్నారు. అందులోనూ దీనిని 'సక్సస్' పాఠశాల క్రింద ఎంపిక చేసి వున్నారు. అలాంటి పాఠశాలకు, అందులో చదివే విద్యార్థులకు సమస్య ఎదురైనా ఒక్క అధికారి పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

# నాసిరకంగా రోడ్డు పనులు!

జిల్లాలో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం క్రింద జరుగుతున్న పనులు కాంట్రాక్టర్లు, అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. ఈ పథకం క్రింద చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో అవినీతి రాజ్యమేలుతున్నది. అధికారులు, కాంట్రాక్టర్‌లు కుమ్మక్కై రోడ్డు నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలకు పాతర వేస్తున్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ఈ పథకం క్రింద జరుగుతున్న పనులు ఎంత నాసిరకంగా వున్నది వర్ణించలేమనాలి. మండల పరిధిలోని రాయలసీమ కాలనీ నుంచి పోలినాయుడు చెరువు మీదుగా రామచంద్రాపురం వరకు లింకురోడ్లు నిర్మించారు. పిఎంజివై క్రింద 70 లక్షల రూపాయలు ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈ నిర్మాణంలో నాణ్యత

**ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం నిష్ఫలం!**

పాటించకపోవడం, గ్రావెల్‌ను ఎక్కువగా వినియోగించడంతో రోడ్డు అధ్వాన్నంగా మారింది. నాసిరకంగా రోడ్డు వేయడంతో తారురోడ్డు కాస్తా మట్టి రోడ్డుగా మారింది. నిబంధనల ప్రకారం గ్రావెల్‌ను తోలి రోడ్డుకు ఇరువైపులా వున్న మార్జిన్ ప్రదేశాలను నిర్మించాల్సి వుండగా కాంట్రాక్టర్ రోడ్డు ప్రక్కనే ప్రొక్లెయినర్‌తో త్రవ్వగా వచ్చిన గ్రావెల్ రోడ్డు మార్జిన్ పనులకు వినియోగించడంతో రోడ్డు పొడవునా పెద్ద పెద్ద గుంటలు ఏర్పడ్డాయి. కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిచ్చినా అధికారులకు అవినీతిలో భాగస్వామ్యం వుండడంతో వాటి గురించి పట్టించుకొనేవారే లేకుండా పోయారు.

**ప్రథమ వర్ధంతి**



మా ఈ జన్మకు కారకురాలు
మా అభివృద్ధికి కృషి చేసిన
మా అమ్మ
వాడా సరస్వతమ్మ గారి
ప్రథమ వర్ధంతి 15-03-2010 తేది
సందర్భంగా
ఆమెను స్మరించుకుంటూ...

**వాడా సరస్వతమ్మ**
స్వర్గీయ వాడా రామలింగారెడ్డి గారి భార్య
ముత్తుకూరు.

**కుటుంబ సభ్యులు**

# పేలవంగా ఫ్లెమింగో ఫెస్టివల్!



ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న పురపాలక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. ప్రక్కన కలెక్టర్ రామ్‌గోపాల్, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పరసా రత్నం, డిసిసిబి ఛైర్మన్ వాకాటి నారాయణరెడ్డి

జిల్లాలోని సూళ్ళూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో ఈ నెల 7వతేది నిర్వహించిన ఫ్లెమింగో ఫెస్టివల్ పేలవంగా జరిగింది. ప్రతి సంవత్సరం జనవరి నెలలో నిర్వహించే ఫ్లెమింగో ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఈ సంవత్సరం మార్చి నెలలో నిర్వహించారు. గతంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం ఈ దఫా ఒక్కరోజుకే పరిమితం చేశారు. సూళ్ళూరుపేట ఎమ్మెల్యే పరసారత్నం అధికారులపై ఒత్తిడి తేవడం వలన మార్చి నెలలో పక్షుల పండుగ ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే పట్టించుకోకుంటే ఈ సంవత్సరానికి పక్షుల పండుగ జరిగి వుండేది కాదు.

రాష్ట్రప్రభుత్వం పక్షుల పండుగ నిర్వహణకు నిధులు కేటాయించకపోయినా జిల్లాలో వివిధ శాఖల నుంచి నిధులు కేటాయింప చేసేందుకు జిల్లా కలెక్టర్ కొంత కృషి చేయడం జరిగింది. అయితే ఆశించిన మేర విస్తృత ప్రచారం లేకపోవడం కారణంగా విద్యార్థులు, ప్రజలు పక్షుల పండుగకు రాలేకపోయారని చెప్పొచ్చు. పండుగ రోజు నాటికి కూడా సూళ్ళూరుపేటలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో కొన్ని ప్రభుత్వ శాఖలు స్టాల్స్‌ను ఏర్పాటు చేసుకోలేకపోయాయి. వేసవి కావడం వల్ల వచ్చిన కొద్దిమంది ప్రజలు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎండకు తట్టుకునేందుకు పలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

కళాశాల ప్రాంగణంలో ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయి. ముందుగా నిర్వాహకులు పక్షుల పండుగకు వచ్చే వారికి నేలపట్టు, భీమునివారిపాళెం వద్ద పెరుగు అన్నం, పులిహోర ఆహార పొట్లాలు అందిస్తామని ప్రకటించారు. అయితే ఇది కూడా అమలు జరగలేదు. కేవలం కొంతమంది దాతల సహకారంతో

> “ఐదారేళ్లుగా నేలపట్టుకు వచ్చే విదేశీ విహంగాలకు స్వాగతం పలుకుతూ నిర్వహిస్తుండిన పక్షుల పండుగను ఈ యేడాది జిల్లా యంత్రాంగం ఘనంగా జరుపలేకపోయింది.”

వాటర్‌ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు అందించారు. మధ్యాహ్నం భోజనం హోటల్స్ కూడా అందుబాటులో లేకపోవడంతో రోడ్డు ప్రక్కన లభించే పుచ్చకాయలు తిని ఆకలి తీర్చుకోవాల్సి వచ్చింది. నేలపట్టు పక్షుల కేంద్రం, భీమునివారి పాళెం వద్ద ఏర్పాటుచేసిన బోటు షికారుకు వెళ్లేవారికి రవాణా సౌకర్యం కోసం ఆర్టీసి బస్సులను ఏర్పాటు చేసింది.

ప్రజలకు అవసరమైనన్ని బస్సులు సమకూర్చకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. వివరాలు చెప్పేందుకు ప్రత్యేక కౌంటర్ వున్నప్పటికి సరైన సమాచారం చెప్పేవారు లేకుండా పోయారు. ఉదయం 9 గంటలకు ప్రారంభించాల్సిన పక్షుల పండుగను రెండున్నర గంటల ఆలస్యంగా రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి సంవత్సరం జనవరి నెలలో పక్షుల పండుగను నిర్వహించేందుకు కృషి చేయడం జరుగుతుందని ప్రకటించారు. అటవీశాఖ, పర్యాటకశాఖల సహకారంతో పర్యాటకులకు అన్ని వసతులు కల్పించి, జాతీయస్థాయిలో ప్రాచుర్యం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

సూళ్ళూరుపేట ఎమ్మెల్యే పరసారత్నం మాట్లాడుతూ దేశంలో రెండవస్థానంలో వున్న పులికాట్ ఉప్పునీటి సరస్సుకు సముద్రం నుంచి నీరు వచ్చే ముఖద్వారం ఇసుకమేటతో పూడిపోవడం వలన నీరు తగ్గి సరస్సులో మత్స్య సంపద క్షీణిస్తుందన్నారు. దీంతో ఈ ప్రాంతానికి వలస పక్షుల రాక తగ్గడంతోపాటు, సరస్సుపై ఆధారపడి జీవించే మత్స్యకారుల జీవనం కష్టంగా మారిందన్నారు. సరస్సు అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ రాంగోపాల్, ఎమ్మెల్యే పరసారత్నం సాయంత్రం సమయంలో నేలపట్టు పక్షుల కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పక్షుల పండుగ కార్యక్రమంలో జిల్లా ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, బీద మస్తాన్ రావు, బల్లి దుర్గాప్రసాద్‌లు, ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, ఎస్‌డిసిసిబి ఛైర్మన్ వాకాటి నారాయణరెడ్డి, ఎ.ఎం.సి ఛైర్మన్ తాళ్లూరు రమణయ్యనాయుడు జిల్లాఎస్పీ దామోదర్, జాయింట్ కలెక్టర్ సౌరబ్‌గౌర్ తదితరులు పాల్గొన్నారు.

## 'బాబు' భావోద్రేకం



మంగళవారం అసెంబ్లీలో వరదలపై చర్చ సందర్భంగా చంద్రబాబు భావోద్రేకానికి లోనయ్యాడు. అసెంబ్లీలో చంద్రబాబు ఈ విధంగా ఎప్పుడూ కనిపించలేదు. వరద బాధితుల కష్టాల్ని గురించి మాట్లాడుతుంటే చంద్రబాబు కంట తడి కనిపించింది. గొంతు బొంగురుపోయింది. వరద బాధితుల కష్టాలు బాబు గుండెను కలిచి వేశాయన్నట్లు ఆయన ప్రసంగం కొనసాగింది. బాబు ప్రసంగం, హావభావాలు చాలా కొత్తగా అనిపించింది. సొంతపార్టీ వాళ్లే బాబులో వచ్చిన ఈ మార్పును చూసి ముక్కున వేలేసుకున్నారు. చంద్రబాబులో రాజకీయ పరిణితి కనిపిస్తోందని ఓ తెదెపా సీనియర్ వ్యాఖ్యానించాడు. కాగా బాబు సీన్‌కు విస్తుపోయిన కాంగ్రెస్ సభ్యులు మాత్రం ఎదురుదాడికి దిగారు. 'బాబు'కు ఆయన మామ ఎన్టీఆర్ నటన వారసత్వంగా వచ్చి వుంటుంది. బాగా నటించాడంటూ దివాకర్‌రెడ్డి లాంటివాళ్లు ఎద్దేవా చేశారు. అయితే 'బాబు' ప్రసంగం నిజంగా బాగుందని తెర వెనుక గుసగుసలు వినిపించాయి.

## 'విస్తరణ' లేనట్లే




ప్రజారాజ్యంపార్టీ ఘోరంగా ఫ్లాప్ అయినా చిరంజీవి మాత్రం రాజకీయాలవైపే మొగ్గు చూపుతున్నాడు. ప్రస్తుతం ఎలాగూ ఖాళీగానే వున్నారు కదా! ఓ సినిమాలో నటిస్తారా! అంటూ చాలామంది చిరును సంప్రదిస్తున్నారట. అయితే 'చిరు' మాత్రం ఈ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరిస్తున్నాడు. మంచికో చెడ్డకో రాజకీయాల్లోకి వచ్చాను. దీని సంగతేదో తేల్చుకుంటాను. అప్పటిదాకా సినిమాల జోలికి పోదల్చుకోలేదంటూ చిరు ఖరాఖండిగా చెబుతున్నాడు. 'చిరు' ఊపు చూస్తే నిజమేననిపిస్తోంది. ఈ మధ్య సమైక్యాంధ్ర నినాదాన్ని తలెత్తుకొని సీమాంధ్ర ప్రాంతాల్లో చురుగ్గా పర్యటిస్తున్నాడు. విద్యుత్ కొరత, అధిక ధరలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నాడు. కార్యకర్తలు తక్కువగా వున్నా తానే ముందుండి నడిపించడం చూస్తుంటే 'చిరు' నిజంగానే రాజకీయాలపై సీరియస్‌గా వున్నాడనిపిస్తోంది.

## 'వివేకా'పై సానుభూతి



మేయరు భానుశ్రీ ఇంటిపై ఎసిబి దాడులు జరిగిన దానికి వివేకానందరెడ్డికి పలువురు ఎమ్మెల్యేలు సానుభూతిని తెలిపారు. మంగళవారం ఉదయం నుంచీ మేయర్ ఇంటిపై దాడి జరుగుతున్న వార్తల్ని టీవీల్లో చూసిన ఎమ్మెల్యేలు అసెంబ్లీలో వివేకాను అడిగి వివరాలు తెలుసుకోవాలని ప్రయత్నించారు. అయితే వివేకా మాత్రం ఈ విషయంలో అతిగా స్పందించకుండా రుసరుసలాడుతూ కనిపించాడు. గిట్టనివాళ్ల కుట్ర. రాజకీయాల్లో ఇదంతా మామూలే అయినా ఏమవుతుంది? అంటూ వివేకా ఎమ్మెల్యేలకు స్వాంతన వచనాలు పలికాడట. మొత్తంమీద మంగళవారం మేయర్‌పై జరిగిన దాడికి ఆనంబ్రదర్స్ అసెంబ్లీలో కాస్తంత ఇబ్బందిగానే కనిపించారు.

## 'మర్రి' ఎక్స్‌ట్రాపాత్ర




మర్రి చెన్నారెడ్డి కుమారుడు, సనత్‌నగర్ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి ఈ మధ్య చురుగ్గా కనిపిస్తున్నాడు. వై.ఎస్ వ్యతిరేకిగా ముద్రపడిన శశిధర్ చాలాకాలంగా అనామకంగా వుండిపోవాల్సి వచ్చింది. రోశయ్య ముఖ్యమంత్రి అయ్యాక శశిధర్ తిరిగి తెరపై కనిపిస్తున్నాడు. ముఖ్యమంత్రి అంతరంగికుల్లో ఒకడిగా ఆయన ఓ వెలుగు వెలుగుతున్నాడు. ముఖ్యమంత్రి వ్యక్తిగత పనుల దగ్గర నుంచి ఇతర మంచీ చెడులదాకా అన్నీ తానై వ్యవహరిస్తున్నాడు. సిఎం క్యాంప్ కార్యాలయంలో జరుగుతున్న వాస్తు మార్పులు కూడా శశిధర్ పర్యవేక్షణలో జరపాలని సిఎం ఆదేశించాడు. దీంతో శశిధర్ రాత్రింబవళ్లు సిఎం క్యాంప్ కార్యాలయం మార్పు చేర్పులపైనే దృష్టి పెట్టాడు. ఇదంతా గమనిస్తున్న వారు శశిధర్‌ను కాబోయే మంత్రి అంటూ ముద్దుగా పిలుస్తున్నారు.



# శాస్త్ర సాంప్రదాయాల సమ్మేళనం 'ఉగాది'

అనాదిగా భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల పరంపరలో ఉగాది పర్వదినం ఒక విశిష్ట స్థానాన్ని కలిగి వుంది. శాస్త్ర సాంప్రదాయాల కలగలపుగా ఉగాదిని చెప్పుకొంటారు. ఉగాది అనగా యుగ ఆరంభం అని అర్థం. తెలుగు వారు జరుపుకొనే పండుగలలో ముఖ్యమైనది ఉగాది. ఆ రోజు నుండే తెలుగు సంవత్సరం మొదలవుతుంది. కాబట్టి తెలుగు వారి మొదటి పండుగైంది. ఉగాది రోజున కొత్తగా పనులు ప్రారంభించడం పరిపాటి. పొద్దుటే లేచి తలంటి స్నానం చేసి క్రొత్తబట్టలు ధరించి ఉగాది పచ్చడితో దినచర్య ప్రారంభిస్తారు. దేవాలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకోవడం, పంచాంగ శ్రవణం ఆనాడు ముఖ్యమైనవి.

చైత్రశుద్ధ పాడ్యమి రోజున బ్రహ్మ సృష్టిని ప్రారంభించారని నమ్ముతారు. వసంత ఋతువు అప్పుడే మొదలవుతుంది. కాబట్టి క్రొత్త జీవితానికి నాందిగా ఉగాది పండుగను జరుపుకొంటారు. ఆ రోజున చేసే ఉగాది పచ్చడికి ఎంతో ప్రాధాన్యత ఉంది. తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు అనే ఆరు రుచులు కలగలసిన ఉగాది పచ్చడి తినడం వల్ల సంవత్సరం పొడవునా ఎదురయ్యే మంచి చెడులను, కష్టసుఖాలను సమంగా స్వీకరించాలన్న సందేశాన్ని ఈ పచ్చడి ఇస్తుంది. మామిడి కాయ, వేపపువ్వు, చింతపండు, బెల్లం తదితర పదార్థాలతో దీనిని తయారు చేస్తారు. ఉగాది పచ్చడి తినడం, ప్రసాదంగా స్వీకరించడంలో ఎంతో శాస్త్రవిజ్ఞానం ఇమిడి వుందని పెద్దలు చెబుతారు. ఉగాది పండుగ ముందు వరకు ఒకవిధమైన వాతావరణం వుంటుంది. ఆ తరువాత ఎండలు పెరగడం లాంటి మార్పులు వాతావరణంలో చోటుచేసుకొంటాయి. ఆ మార్పుల వల్ల శరీరానికి ఎలాంటి వ్యాధులు సోకకుండా వాటిని దూరం చేసుకొనేందుకు ఈ పచ్చడి ఉపయోగపడుతుంది. ఆయుర్వేద శాస్త్రపరిజ్ఞానంతో పరిశీలిస్తే ఇవి ఎంతో అమూల్యమైన ఔషధ గుణాలుగా కన్పిస్తాయి. వేపపూత, కొత్త బెల్లం, మామిడికాయలు, చెరకు శరీరానికి ఆరోగ్యాన్ని కల్గిస్తాయి. ఋతు మార్పు కారణంగా వచ్చే వాత, కఫ, పిత్త దోషాలను హరించే ఔషధంగా ఉగాది పచ్చడి తినే ఆచారం ఆరంభమైంది.

ఉగాది అనగా గుర్తుకు వచ్చే మరొక అంశం పంచాంగ శ్రవణం. పంచాంగం అంటే తిథి, వార, నక్షత్రం, యోగం, కరణం అనే ఐదు అంగాలతో కుదురుకున్నదని అర్థం. ఈ పంచాంగంలో రాశి ఫలితాలు లాంటివి ఎన్నో జ్యోతిష సంబంధమైనవి వుంటాయి. వీటన్నింటిని మంచి అనుభవజ్ఞులైన పండితులు ఉగాది రోజున సాయంత్రం వేళ దేవాలయం లాంటి పవిత్ర ప్రదేశాలలో వివరించి చెప్పడం జరుగుతుంది. వాటిని విని తమ జాతకరీత్యా కలుగబోయే దోషాలు ఏవైనా వుంటే వాటికి శాంతులు జరిపించుకొని సుఖమయజీవితానికి ఉద్యుక్తులవుతారు.

## ట్రంకు రోడ్డు కబుర్లు

### దేముడంటే భయం లేదు!



అవినీతి, అక్రమాలు, తప్పుడు పనులు చేసేవారు దేముడంటే భయపడేవారు. ఆయన ముందు ప్రమాణాలు గట్రా చేయను సాహసించేవారు కాదు. కాని రోజులు మారాయి. తాము సంపాదించిన అవినీతి సొమ్మును దేవుడి హుండీలో కూడా బాగానే వేస్తున్నవారు ఆయనంటే లెక్క లేకుండా వ్యవహరిస్తున్నారు. నెల్లూరు మేయర్ భానుశ్రీపై ఆధారాలతో సహా ఆరోపణలు వచ్చాయి. గతవారం రోజులుగా పత్రికలు, టీవీలు ఈ వార్తలు ప్రసారం చేశాయి. అయినా 'శ్రీ' వెరవలేదు. 6తేది వీటిని ఖండిస్తూ కార్పొరేషన్ ఆఫీసులో మీడియా సమావేశం పెట్టిన ఆమె నేరుగా ప్రాంగణంలోనే వున్న షిర్డి సాయి బాబా మందిరానికి వెళ్లి పళ్లెంలో కర్పూరహారతి వెలిగించి తనపై విమర్శలు చేస్తున్నవారు నాశనమైపోవాలని 'బాబా'ను కోరారు. భానుశ్రీ తెంపరితనాన్ని చూసి అందరూ ముక్కున వేలేసుకొన్నారు. మరుసటి రోజే మేయర్ ఇంటిపై ఏసిబి దాడులు జరగడంతో బాబా పవరేమిటో బయటపడిందని లోలోన జనం సణుగుతున్నారు.

### పాపం... కలెక్టర్, జెసి!



నెల్లూరు రోడ్లతోపాటు నగరాన్ని ఆనుకొని వున్న ఐదవ నెంబరు జాతీయ రహదారిపై ఐరన్ ఓర్ లారీలు, ఇతర వాహనాలు వాయువేగంతో నడుస్తూ ఎందరి ప్రాణాలో బలిగొన్నాయి. జిల్లా అధికారులు ఈ విషయమై పెద్దగా స్పందించలేదు. అయితే 5తేది ఇటువంటి వాహనాల వల్లే జిల్లా కలెక్టర్ రాంగోపాల్, జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్ తృటిలో ప్రమాదాలు తప్పించుకొన్నారు. పొదలకూరురోడ్డులో వెళ్తుండిన కలెక్టర్ కారును ఆటో ఢీ కొట్టడంతో వాహనం ముందు భాగం దెబ్బ తినడంతోపాటు కలెక్టర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఐదవ నెంబర్ జాతీయ రహదారిపై వెళ్తున్న జాయింట్ కలెక్టర్ వాహనాన్ని ఓ లారీ ఢీ కొట్టేంతపని చేయడంతో ఆయన డ్రైవర్ చాకచక్యంగా తప్పించారు. జెసి అప్పటికప్పుడే ఆ లారీని సీజ్ చేయించారు. తమ ప్రాణాల మాదిరి ప్రజల ప్రాణాలు కూడా ఎంత విలువైనవో ఈ ఇద్దరు అధికారులకు ఈ సంఘటనలు తెలియజేశాయనాలి.

### ఎవరైతేనేం...!



ఎస్పీగా బాధ్యతలు తీసుకొన్న ఈతముక్కల దామోదర్ స్పీడుగా పని చేస్తున్నారు. నగరంలో గలాటాలను అదుపు చేయను రౌడీషీటర్లు, ట్రాఫిక్‌ను అదుపు చేయను ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశాలు పెట్టారు. ఆటోడ్రైవర్లను ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ఓవర్ లోడ్‌తో వెళ్లవద్దని హెచ్చరించారు. ఈ సమావేశంలోనే ఓ ఆటోడ్రైవర్ వల్ల తానుపడ్డ ఇబ్బందిని చెప్పుకొచ్చారాయన. ముత్తుకూరుకు నా క్వాలిస్‌లో వెళ్లి వస్తున్నాను. ఓ ఆటోడ్రైవర్ నా వాహనం ముందు వెళ్తున్నాడు. నా డ్రైవర్ హారన్ కొడుతున్నా అతను సైడివ్వలేదు. జిల్లా ఎస్పీనైన నేనే ఈ విధమైన ఆటో ఘాతాకానికి గురైతే సామాన్యుడి పరిస్థితి ఏమిటని వాపోయారాయన. ఆటోడ్రైవర్లు ఓవర్ స్పీడ్‌తోపాటు ఓవర్‌గా వ్యవహరిస్తే తోక కత్తిరిస్తానన్నారాయన.

### తెలివిమీరిన వాళ్లు!



తాడి తన్నేవాడుంటే వాడి తలదన్నేవాడుంటాడని నానుడి. నెల్లూరులో అసభ్య పోస్టర్లపై నగర డిఎస్పీతోపాటు అశ్లీల ప్రతి ఘటనా వేదిక యుద్ధాన్ని ప్రకటించాయి. దీంతో సినిమా హాళ్లవారు ఆలోచించి ఒక నిర్ణయం తీసుకొన్నారు. అసభ్యంగా వున్న సాధ్యం, హైస్కూల్, ఇంకోసారి, కళావర్ కింగ్ పోస్టర్లపై వాళ్లే కొన్నిచోట్ల బ్లూ రంగులు పూశారు. మరికొన్నిచోట్ల అడ్డంగా సినిమా విడుదల తేదీ కాగితంపై పెద్దదిగా వ్రాసి కరిపించి నగరంలో మహిళలు పోస్టర్లు చించకుండా తెలివైన ఎత్తుగడే వేశారు.

### అవినీతి, అక్రమాలే... ఘనత



గతంలో నీతిగా బతికేవారి గూర్చి గొప్పగా చెప్పేవారు. ఇప్పుడో... ఎంతగా అవినీతి, అక్రమాలకు పాల్పడితే వారు అంత గొప్ప వ్యక్తులుగా చలామణి అయిపోతున్నారు. నెల్లూరులో అయితే ఈ మధ్య నేతలు, అధికారుల అవినీతి అక్రమాల మీద విస్తృత చర్చ జరుగుతోంది. ఇటీవల వరకు నెల్లూరు డిఇఓగా వ్యవహరించిన ఆంజనేయులును కార్యాలయంలో పని చేసే వుద్యోగి ఒకరు పదుగురి ఎదుట నిలదీయడంతో ఆయన సెలవుపెట్టి వెళ్లిపోయారంటున్నారు. డిఇఓ కార్యాలయ వుద్యోగులతో సమావేశంలో వుండగా సురేష్ అనే వుద్యోగి సెకండరీగ్రేడ్ టీచర్‌గా వుద్యోగం ఆరంభించినప్పుడు నీ ఆస్తి ఎంత? ఇప్పుడు నీవెంత ఆస్తి సంపాదించావనే సరికి డిఇఓ స్థాణువయ్యారట.

# అభివృద్ధి పథాన కనుపర్తిపాడు పంచాయితీ!

నెల్లూరు రూరల్ మండలంలోని కనువర్తిపాడు గ్రామపంచాయితీ అభివృద్ధి పథంలో పయనిస్తుంది. ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధులతోనే కాకుండా సాధారణ నిధుల నుంచి ఎక్కువ పనులు చేపడుతున్నారు. పంచాయితీ పరిధిలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రెండు పూటలా త్రాగునీరు సరఫరా అవుతున్నది. ఇంతే కాకుండా పంచాయితీలో పారిశుధ్యం మెరుగుపరచడంతోపాటు, దోమల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. వున్న నిధులతోనే అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

కనువర్తిపాడు గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన వెందోటి గిరిజమ్మ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ పంచాయితీలో మూడు వేల జనాభా, ఆరు వందల కుటుంబాలు, వెయ్యిమంది ఓటర్లు వున్నారు. అభివృద్ధి పనుల కోసం 12వ ఆర్థిక సంఘం, ఎస్.ఎఫ్‌సి నిధులు 60వేల రూపాయలు విడుదలవుతాయి. పంచాయితీకి వివిధ పన్నుల క్రింద లక్షా 30వేల రూపాయలు వసూలు అవుతాయి. ఇవే కాకుండా సెస్సు, రిజిస్ట్రేషన్ ఫీజు రూపంలో అదనంగా మరో ఆరు లక్షల రూపాయలు ఆదాయ వనరులుగా అందుతాయి. అదనపు వనరులతో పంచాయితీ సిమెంటురోడ్లు, త్రాగునీటి సరఫరా కోసం పైపులైన్ల ఏర్పాటు చేశారు.

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అధ్వాన్నంగా వున్న అంతర్గత రోడ్లకు గ్రావెల్ వేయించి ప్రజలు నడచి వెళ్లేందుకు ఇబ్బంది లేకుండా చేశారు. గ్రామీణప్రాంతం కావడంతో కొంతమేర డ్రైనేజి కాల్వల నిర్మాణం చేపడితే ఎక్కడ కలపాలన్న దానిపై స్పష్టత రాలేదు. పంచాయితీ పాలక వర్గం, కార్యదర్శి శ్రీనివాసులు నిత్యం ప్రజలకు అందుబాటులో వుంటున్నారు. గ్రామంలో ఎక్కడ వీధిలైట్లు వెలగకపోయినా వెంటనే స్పందించి లైట్లు ఏర్పాటుచేస్తారని గ్రామస్తులు చెప్పారు.

ఇందిరమ్మ గృహాల నిర్మాణం, పెన్షన్ల పంపిణీలో ఎక్కడా ఆటంకం ఏర్పడకుండా అన్ని చర్యలు చేపడుతున్నారు. నగరానికి దగ్గరగా వున్న గ్రామం కావడం, చైతన్యవంతులైన ప్రజలుండడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలు చకా చకా జరుగుతున్నాయి. ఈ క్రమంలో పంచాయితీ పరిధిలో జరిగిన అభివృద్ధిపై స్థానికులు వెల్లడించిన అభిప్రాయాలు ప్రక్కన ఇస్తున్నాం.



**దోమల బెడద వుంది!**

పంచాయితీ పరిధిలో కొంతమేర అభివృద్ధి పనులు చేశారు. అయితే దోమల బెడద అధికంగా వుంది. రాత్రి సమయంలో వీటి కారణంగా ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా పంచాయితీ పాలక వర్గం, అధికారులు స్పందించి దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి.

– సుబ్బమ్మ



**పనులు భేష్!**

పంచాయితీ పరిధిలో ఇప్పటివరకు వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయం. ఎస్సీ, ఎస్టీ కాలనీలలో సిమెంటు రోడ్లు వేశారు. త్రాగునీటి సరఫరా రెండు పూటలా అవుతుంది. కొంత మంది లబ్దిదారులు ముందుకు రాకపోవడం కారణంగా ఇందిరమ్మ గృహాలు పూర్తికాకుండా అసంపూర్తిగా మిగిలిపోయాయి.

– సురేష్



కొత్తగా కట్టిన పంచాయితీ భవనం.



గ్రామంలోని సిమెంటు రోడ్డు.

అవినీతి కథ

# పారిశుధ్య సిబ్బంది కనీసావసరాల నిధులు కాజేసిన పాలకులు!

## నెల్లూరు కార్పొరేషన్‌లో మరో కుంభకోణం!

నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అవినీతి, అక్రమాలు నిత్యం చోటు చేసుకుంటూనే వున్నాయి. కార్పొరేషన్ పాలకవర్గం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడంతో అధికారులు కూడా అదే తరహాలో పయనిస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతి విభాగంలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఇంజినీరింగ్ విభాగం, సిటీ ప్లానింగ్, హెల్త్ విభాగం, జనన, మరణాల నమోదు తదితర విభాగాలు వున్నాయి. వీటిలో ఏ పని చేయించుకోవాలన్నా సిబ్బంది దగ్గర నుంచి అధికారుల వరకు చేతులు తడపాల్సి వుంటుంది. సిబ్బందికి, అధికారులకు లంచాలు ఇవ్వడం ఇక్కడ మామూలు వ్యవహారంగా మారిపోయింది.

వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజల నుంచి లంచాలు తీసుకోవడమే కాకుండా పలు వస్తువుల కొనుగోలు పేరుతో లక్షలాది రూపాయలు దుర్వినియోగం చేస్తున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఎన్నో సంవత్సరాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న కుంభకోణాలు ఇటీవల వెలుగు చూశాయి. నగరంలో పారిశుధ్యం పనివారికి ఇవ్వాల్సిన వస్తువులు ఇవ్వకుండానే ఇచ్చినట్లు రికార్డుల్లో నమోదు చేసి లక్షలాది రూపాయలను కాజేస్తున్నారు. కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న వారికి ప్రతి సంవత్సరం ప్యాంటు, షర్టు, చీరలు, చెప్పులు, గ్లౌజ్‌లు, కొబ్బరి నూనె, టవల్స్ రెండు జతల వంతున అందజేయాలి.

వీటిని సరఫరా చేసేందుకు కాంట్రాక్టర్ల నుంచి టెండర్లను పిలిచి ఖరారు చేస్తారు. అయితే 2003 సంవత్సరం నుంచి 2009 సంవత్సరం వరకు పై సామాగ్రిని కొనుగోలు చేసినట్లు రికార్డులలో నమోదు చేయడం జరిగింది. టెండర్లు రాకపోయినా కూడా బినామీపేర్లతో కార్పొరేషన్ అధికారులే వారి బంధువులకు టెండర్ ఖరారు చేసేస్తారు. ఇది కూడా ఎవరికి అనుమానం రాకుండా వుండేందుకు బయట జిల్లాలకు చెందిన వారి పేర్లు, చిరునామాలను పగడ్బందీగా నమోదు చేస్తుంటారు. పారిశుధ్య పని వారికి వస్తువులను అందించేందుకు కార్పొరేషన్ ప్రతి సంవత్సరం దాదాపు 20లక్షల రూపాయల వరకు ఖర్చు చేయడం జరుగుతుంది.

గతంలో కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తూ ఎసిబి అధికారులకు పట్టుబడిన చార్లెస్ ఉమాపతి హయాంలోనే భారీస్థాయిలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఆ తర్వాత ఆయన సస్పెండ్ కావడం, అప్పటి మేయర్ పులిమి శైలజను ప్రభుత్వం తొలగించడం వంటి పరిణామాల క్రమంలో వీటి గురించి పట్టించుకునేవారు లేకుండా పోయారు. భానుశ్రీ మేయర్ అయిన తర్వాత కార్పొరేషన్‌లో అధిక భాగం బినామీలకు ఆస్కారం ఏర్పడింది. కార్పొరేషన్ పరిధిలో జరిగే ప్రతి పని బినామీ పేర్లతోనే జరుగుతున్నాయి. అధికారపక్షానికి చెందిన కార్పొరేటర్లు, అధికారులు కుమ్మక్కు కావడంతో ఎన్ని అభ్యంతరాలు వచ్చినా ఏ మాత్రం లెక్క చేయడం లేదు.

శ్రీకాళహస్తికి చెందిన ఒక కాంట్రాక్టర్‌కు పది లక్షల రూపాయలను చెల్లించిన విషయం పెద్ద దూమారం రేపింది. పారిశుధ్య పని వారికి గత సంవత్సరం నాసిరకం సామాగ్రిని అందజేసి అధిక మొత్తంలో కాంట్రాక్టర్‌కు నగదు చెల్లింపులు జరిపారు. గతంలో ఇదే కాంట్రాక్టర్‌కు పలు దఫాలుగా నగదు చెల్లింపులు జరిపినట్లు ఇటీవల వెల్లడయ్యింది. ఈ నగదు చెల్లింపు వ్యవహారంలో అధికారపార్టీ నేతల ప్రమేయం వుండడంతో అధికారులు నోరు విప్పలేకపోతున్నారు. పారిశుధ్య పనివారి పేరుతో నిధుల స్వాహాకు పాల్పడడం సిగ్గు చేటు. నగరంలోని మురికిని తొలగించే దర్భర జీవనం గడుపుతున్న వీరికి చెందాల్సిన వస్తువులను కూడా చెందకుండా చేస్తున్నారంటే ఎంత దిగజారిపోయారో అర్థం చేసుకోవచ్చు.




అవినీతికి నిలయమైన నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం.

కార్పొరేషన్‌కు ప్రజలు వివిధ రూపాల్లో చెల్లిస్తున్న పన్నులు ప్రక్కదార్లకు మళ్లుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, అవినీతి అక్రమాలకు పాల్పడే వారికి అధికారపార్టీ నేతల ఆశీస్సులు వుండడంతో కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయి.

# రోశయ్య కుదుట పడ్డాడు!



పదవి చేపట్టిన ఆరు నెలలకు కాసింత ఊపిరి తీసుకొనే వ్యవధి చిక్కింది ముఖ్యమంత్రి రోశయ్య గారికి. సెప్టెంబర్ మొదటి వారంలో ప్రమాణ స్వీకారం చేశారాయన. అప్పటి నుంచి ప్రతి నెల ఏదో ఒక చీకాకు. ఏదో ఒక చిక్కు సమస్య. వైఎస్ మరణ విషాదం నుంచి కోలుకోక ముందే వైఎస్ జగన్ పదవీ ప్రయత్నం సమస్యలలో నెట్టింది. అది నడుస్తుండగానే కర్నూలు జిల్లా వరదలు ముంచెత్తాయి. ఆ వెంటనే కెసిఆర్ ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం అగ్నిగుండంగా మారింది. ఆ మంటలు చల్లారడానికి కేంద్ర హోంమంత్రి చిదంబరం తెలంగాణా ఏర్పాటు ప్రకటన చేయడంతో ఆంధ్ర ప్రాంతంలో కూడా రాజకీయ మంటలు చెలరేగాయి. రాజీనామా నాటకాలతో శాసనసభ ఉంటుందా, రద్దై పోతుందా అన్న అనుమానాలు తలెత్తాయి. మరొక ప్రక్క తన స్వంత మంత్రులే తనను లెక్క చేయని దీన స్థితి. వారిని అదుపాజ్ఞలలో పెట్టుకోవడం బ్రహ్మ ప్రయత్నంగా మారింది. ఇంత స్వల్ప కాలంలో ఇన్ని చిక్కుముడులు విప్పవలసిన దుర్భర పరిస్థితి చరిత్రలో ఏ ముఖ్యమంత్రికి కూడా ఎదురు కాలేదనడం నిజం.

మరొకరు ఆ స్థానంలో వుంటే వాటి పరిష్కారం కోసం తమకు తోచిన ప్రయత్నాలు చేసి, మరిన్ని కొత్త సమస్యలు కొని తెచ్చుకొని వుండేవారు. కాలమే అన్ని సమస్యలను పరిష్కరిస్తుందన్న నమ్మకంతో జరుగుతున్న వాటిని చూస్తూ ఊరుకోవడం తప్ప ఏమీ చేయకుండా నిర్లిప్తంగా ఉండి పోయాడు రోశయ్య. చివరకొచ్చేసరికి అదే బాగా కలిసి వచ్చింది ఆయనకు. దాదాపుగా అన్ని సమస్యలు వెనక్కు వెళ్లిపోయాయి. తను మాత్రం వివాదరహితంగా మిగిలిపోయాడు. ఈ పరిణామం ఆయన పదవిలో బాగా కుదురుకోవడానికి ఉపయోగపడింది.

ఇప్పుడిక ముఖ్యమంత్రికి సవాళ్లు ఏవీ లేవు. 12 మంది ఎమ్మెల్యేల రాజీనామాల వల్ల ఏర్పడిన ఖాళీలకు జరిగే ఉప ఎన్నికలను ఆయన పెద్దగా పట్టించుకోవడం లేదు. వాటన్నిటిలో ఓడిపోయినా ఆయన పదవికి, ప్రభుత్వానికి వచ్చే ముప్పు ఏమీ లేదు. ఉద్యమ నినాదంతో చేసిన రాజీనామాలు కాబట్టి, ఉద్యమ బలంతో గెలిచారని చెప్పి సరిపెట్టవచ్చు. ఒక వేళ ఒకటి రెండు సీట్లు గెలిస్తే తన గొప్పే అని చెప్పుకొనే అదృష్టం ఎంతమంది ముఖ్యమంత్రులకు దక్కుతుంది చెప్పండి.

పరిస్థితులు సానుకూలమయ్యాయి కాబట్టి, ప్రభుత్వం మీద తన పట్టు పెంచుకోవడానికి రోశయ్య ఇక నుంచి తన దృష్టి కేంద్రీకరిస్తాడని పరిశీలకులు భావిస్తున్నారు. ఇప్పటికే వైఎస్ జగన్ దూకుడుకు బ్రేకులు వేశారాయన. జగన్ మనిషి అన్నవాళ్లను తమ పరిధులు దాటకుండా వుంటేనే భవిష్యత్తన్న పరోక్ష సంకేతాలు పంపించాడు. వాటితో చాలా మంది మంత్రులు, ఎమ్మెల్యేలు దారికి వచ్చారు. శాసనసభ సమావేశాలు మరొక మూడు వారాలలో ముగిసి పోతాయి. ఆ వెంటనే మంత్రివర్గ విస్తరణ చేపట్టాలన్నది ఆలోచన. అందులో వైఎస్ వర్గానికి చెందిన వారమన్న ధీమాతో తనను ధిక్కరించిన ముగ్గురు నలుగురు మంత్రులకు తోక కత్తిరించ వచ్చునని చెప్తున్నారు. కొందరికి ఉద్వాసన చెప్పడం, మరికొందరికి ప్రాధాన్యత శాఖలు ఇవ్వడం జరగవచ్చు. తన స్వంత మనుషులు అనుకొన్న కొందరిని మంత్రివర్గంలోకి తీసుకొంటారని అంచనా.

నామినేటెడ్ పదవుల విషయంలో ఇప్పటికే ముఖ్యమంత్రి ఈ విధానం పాటిస్తున్నాడు. తాజాగా ప్రెస్ అకాడమీ అధ్యక్ష నియామకం అందుకొక ఉదాహరణ. కెవిపి కానీ, రాష్ట్ర కాంగ్రెస్‌లోని మరే ఇతర వర్గాన్ని కానీ సంప్రదించకుండానే ఈ నియామకం ఉత్తర్వు జారీ చేశాడు. మంత్రివర్గ విస్తరణలో సైతం తాను స్వేచ్ఛగా వ్యవహరిస్తానని చెప్పడం కోసం శాసనసభ జరిగే సమయంలో ఈ నియామక ఉత్తర్వు ఇచ్చాడని అనుకోవచ్చు.

# తెలంగాణపై రాజకీయ పార్టీల నాటకం!

- **శ్రీకృష్ణ కమిషన్ వైపే అందరి చూపు.**

రాజకీయాలకు ప్రాతిపదిక సిద్ధాంతం. దాని పునాదుల మీదనే ప్రజలకు సంబంధించిన వివిధ అంశాలపై విధానాలు రూపొందించుకోవాలి. ఒక్కొక్క పార్టీకి ఒక్కొక్క సిద్ధాంతం వుంటుంది. ఒక్కొక్క అజెండా వుంటుంది. వాటిని చూపించే ప్రజల వద్దకు వెళ్లాలి. ఎవరి విధానాలు నచ్చితే వారికి ప్రజలు ఓటు చేయాలి. మన రాష్ట్రంలో ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీలకు సవాలుగా నిలిచిన అంశం తెలంగాణ విభజన ఉద్యమం. పది కోట్ల మంది తెలుగు ప్రజల మనోభావాలతో ముడిపడిన సమస్య ఇది. ఒక రాష్ట్రం మొత్తం మీద సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల మీద తీవ్ర ప్రభావం చూపే విషయం. దీనిపైన తీసుకొనే నిర్ణయం, అది ఏదైనా కానీ, ఎటైనా కానీ, కోట్లాది ప్రజల భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. వారి జీవితాలలో ఎన్నో మార్పులు తెస్తుంది. మలుపులు తిప్పుతుంది. అవి మంచికి కావచ్చు, కీడు కల్గించవచ్చు.

ఇంత కీలక అంశం మీద ప్రధాన రాజకీయ పార్టీలు వేటికి కూడా స్పష్టమైన విధానం లేదు. సిద్ధాంతం లేదు. చిన్న రాష్ట్రాల వల్ల రాజకీయ అస్థిరత ఏర్పడి ఆర్థిక ప్రగతి మందగిస్తుందన్నది కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం. వారు దానికి కట్టుబడితే, తెలంగాణ ఏర్పాటు తమ విధానం కాదని ప్రకటించాలి. చిన్న రాష్ట్రాల వల్ల పరిపాలన ప్రజలకు చేరువై, ప్రభుత్వాలు సమర్థవంతంగా పని చేస్తాయన్నది బిజెపి సిద్ధాంతం. వారు దానికి కట్టుబడితే తెలంగాణ ఇచ్చి తీరాలని ప్రకటించాలి. ప్రజల అభిప్రాయం తెలంగాణకు అనుకూలంగా వుంది కాబట్టి, వారి మనోగతాన్ని గౌరవించి తెలంగాణ ఏర్పాటు తమ విధానంగా ఆమోదించామని ఎన్నికలకు ముందు పొలిట్ బ్యూరోలో ఒక తీర్మానం చేసింది తెలుగుదేశం పార్టీ. దానికి కట్టుబడితే, తెలంగాణ ఏర్పాటుకు వారు అభ్యంతరాలు చెప్పకూడదు. కానీ ఈ మూడు పార్టీలు శ్రీకృష్ణ కమిషన్ ముందు దొంగ ఆటలు ఆడుతున్నాయి.

అటు కాంగ్రెస్ తరపున పిసిసి కానీ, ఇటు తెలుగుదేశం తరపున పొలిట్ బ్యూరో కానీ శ్రీకృష్ణ కమిషన్‌కు ఒక నివేదిక సమర్పించేందుకు సిద్ధంగా లేవు. కాంగ్రెస్ పక్షాన ఐదు రకాల నివేదికలు ఇవ్వబోతున్నారు. తెలంగాణ ఏర్పరచాలని, వద్దు సమైక్యంగా వుంచాలని, కాదు ఆంధ్రను ప్రత్యేకం చేయాలని, రాయలసీమను తెలంగాణలో కలపాలని, హైదరాబాదును తెలంగాణలోనే వుంచాలని, కాదు కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చాలని... ఇట్లా ఒక్కొక్క ప్రాంతం కాంగ్రెస్ నేతలు ఒక్కొక్క రకంగా నివేదికను శ్రీకృష్ణ కమిషన్‌కు సమర్పించేందుకు అనుమతిస్తున్నది కాంగ్రెస్ పార్టీ. ఇంచుమించుగా తెలుగుదేశం పార్టీ కూడా అవే పాట్లు పడుతున్నది. తమ పార్టీలో ఏ ప్రాంతం నేతలు ఆ ప్రాంతం కోరికలతో వినతి పత్రాలు ఇవ్వడానికి సమ్మతి తెలియజేశాడు చంద్రబాబు.

చాలా దురదృష్టకరమైన పరిస్థితి ఇది. రాజకీయ పార్టీలు సిద్ధాంతపరంగా దివాలాకోరుతనం పాటించడం ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరం. ఏ గాలి తోలితే ఆ వైపుకు తెరచాప ఎత్తే పోకడలను అవలంభించడం రాజకీయ పార్టీలు చేయదగిన పని కాదు. కాంగ్రెస్ గతంలో ఎప్పుడూ ఇటువంటి తప్పుడు పోకడలు అవలంభించలేదు. 1950 దశకంలో రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ, ఆంధ్ర కలిసే వుండాలన్నది తన అభిమతమని జవహర్‌లాల్ నెహ్రూ నిర్భయంగా ప్రకటించాడు. ఫజలుల్లా కమిషన్ తెలంగాణ ఏర్పాటుకు సిఫార్సు చేసినా లెక్క చేయకుండా తన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టాడు. 1969, 1972 జై తెలంగాణ, జై ఆంధ్ర ఉద్యమాల విషయంలో ఇందిరమ్మ అంతకంటే కఠినంగా వ్యవహరించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని శ్రేయోభిలాషులు హెచ్చరికలు చేసినా, ప్రజల క్షేమం కోసం రాష్ట్రం సమైక్యంగా వుండాలన్నది తను నమ్మిన విధానం కాబట్టి, ఎంతో ప్రతిఘటనను ఎదుర్కొని కూడా ఖచ్చితమైన నిర్ణయం తీసుకొన్నది. కానీ ఇప్పటి నేతలు ప్రజలను మోసం చేస్తున్నారు. నయవంచనకు పాల్పడుతున్నారు. తమ మనసులోని భావనలను బయటకు చెప్పకుండా అన్ని ప్రాంతాలలోని ఓట్లు తమకే రావాలన్న చవకబారు ఎత్తుగడతో రాష్ట్ర ప్రజల భవిష్యత్తును పణంగా పెట్టి రాజకీయ నాటకాలు ఆడుతున్నారు. రాజకీయ పార్టీల ఈ దివాళాకోరుతనాన్ని శ్రీకృష్ణ కమిషన్ అయినా తన నివేదికలో తూర్పార బడుతుందేమో వేచి చూద్దాం.

## విత్తనాభివృద్ధి సంస్థ

5వ పేజీ కొరవ

కిలోపై ఐదు రూపాయల ఆదాయానికి విక్రయిస్తారు. ఉదాహరణకు 11 రూపాయలకు కొనుగోలు చేసిన ఐఆర్ 64 విత్తనాలను 16 రూపాయలకు విక్రయిస్తుంటారు. ఈవిధంగా అక్టోబర్ నెలలో 45వేల క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలను సేకరించడం జరిగింది. వీటిలో మన జిల్లా రైతుల నుంచి 25వేల క్వింటాళ్లు కొనుగోలు చేయగా మిగిలిన 20 క్వింటాళ్ల విత్తనాలను ఇతర జిల్లాల నుంచి కొనుగోలు చేశారు. సీజన్‌లో విక్రయించలేని వరి విత్తనాలను సీజన్ పూర్తయిన తర్వాత టెండర్ ద్వారా ధాన్యం రూపంలో విక్రయిస్తుంటారు.

### సంస్థకు నష్టం!

అధికారులు కిలో ధాన్యాన్ని 16 రూపాయలుగా నిర్ణయించగా టెండర్‌దారులు తొమ్మిది నుంచి పది రూపాయలకు కోట్ చేశారు. దీంతో టెండర్లను రద్దు చేస్తూ వస్తున్నారు. రైతులకు సకాలంలో వరి విత్తనాలను సరఫరా చేసి వుంటే రైతుల అవసరాలు తీరడంతోపాటు విత్తనాభివృద్ధి సంస్థకు ఆదాయం చేకూరేది. ఈ సంస్థ అధికారుల నిర్వాకం కారణంగా రైతులతోపాటు ప్రభుత్వం కూడా నష్టపోవాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా ఈ సంస్థ అధికారుల పై కూడా పలు అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. బయట వ్యాపారస్తులతో కుమ్మక్కై సకాలంలో విత్తనాలను సరఫరా చేయడం లేదన్న విమర్శలు వున్నాయి.

రైతులకు విత్తనాలను సీజన్‌లో సరఫరా చేయకుండా కొంత ఆలస్యం చేస్తే రైతులు బయట మార్కెట్లో విత్తనాలను తప్పనిసరిగా కొనుగోలు చేస్తారు. రైతుల అవసరాలను అవకాశంగా తీసుకున్న వ్యాపారస్తులు సంస్థ అధికారులతో ఆలస్యం చేసే విధంగా ముందుగానే ఒప్పందం చేసుకుంటున్నారన్న ప్రచారం వుంది. ఏది ఏమైనా విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు వ్యవహరిస్తున్న తీరు రైతులకు కష్టాలు కలిగిస్తుందన్నది వాస్తవం.

## నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

మాత్రం ఆగడం లేదు. కేశవులునగర్‌లోని విశ్రాంత క్రైమ్ సిఐ అబ్రహాం ఇంటికి గుంటూరు నుంచి చుట్టపుచూపుగా వచ్చిన లలితకుమారికి చెందిన బంగారం, బ్యాంకు పుస్తకం, ఎటిఎం కార్డును 7వ తేది దొంగలు పట్టుకెళ్లారు.

### ఎసి మార్కెట్‌లో మార్పు తేలేకున్నారు!

నెల్లూరు ఎసి కురగాయల మార్కెట్‌లో ఇటు మార్కెటింగ్ శాఖాధికారులు గాని అటు తూనికలు కొలతల శాఖాధికారులు గానీ ఎలక్ట్రానిక్ తక్కెడలు పెట్టించలేకున్నారు. మార్కెట్‌లోని వ్యాపారులు తక్కువ తూకం రాళ్లతో కూరగాయలు తూచి ఇవ్వడం వల్ల వినియోగదారులు నష్టపోతున్నారు. 8వ తేది సైతం తప్పుడు తూకాలు తూస్తున్న నలుగురిని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శేషయ్య పట్టుకొన్నారు. ఆయన మీదకు సైతం వ్యాపారులు తగాదాకు వెళ్లారంటే వీరి రౌడీయిజాన్ని పటాపంచలు చేయను ఎస్పీ దామోదర్‌గారే ఏదో ఒక చర్యకు ఉపక్రమించక తప్పదు.

### మూలపేటలో ధగధగలు

నెల్లూరు మూలపేట సెంటర్‌లో 7వ తేది హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యేల ద్వయం శ్రీధర్‌కృష్ణారెడ్డి, వివేకానందరెడ్డి ప్రారంభించారు. తన సెంటర్‌లో ధగధగలు చూసి నగర కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల నరసింహారావు మోము వికసించింది.

# వికృతి నామ సంవత్సరంలో మిశ్రమ ఫలితాలు!

**ధరలు పెరుగుతాయి. వర్షాలు బాగా కురుస్తాయి. కానీ జనం వ్యాధులు, ఇతర భయాలతో బతుకు వెళ్లదీయాల్సి వస్తుంది.**

## ఉగాది పంచాంగం

**పి.ఎం.గోపాలాచారి**

పంచాంగ శ్రవణం విశేష పుణ్యఫలప్రదం. సకల సంపదలనొసగుతుంది. ఉగాదినాడు తెల్లవారుఝామున లేచి భగవంతుని ధ్యానించి, ఆ పై మంగళస్నాన మాచరించి, పూజాదులు నిర్వర్తించి, కొత్త వస్త్రాదులు ధరించి, నింబ కుసుమ భక్షణం చేసి, పండుగ వాతావరణాన్ని ఏర్పరచుకోవాలి. ఆ దినం పంచాంగం చదవడం, వినడం శుభకరం.

ఈ సంవత్సరానికి చాంద్రమానము ననుసరించి 'వికృతి' అని పేరు.

ఈ సంవత్సరంలో... రాజు - కుజుడు; మంత్రి - బుధుడు; సేనాధిపతి - కుజుడు; సస్యాధిపతి - శని; ధాన్యాధిపతి -. గురువు; మేఘాధిపతి - కుజుడు; అర్ఘాధిపతి - కుజుడు; రసాధిపతి - చంద్రుడు; నీరసాధిపతి - శుక్రుడు.

| రాశులు | ఆదాయం | వ్యయం | రాజపూజ్యత | అవమానం |
|---|---|---|---|---|
| మేషం | 8 | 14 | 4 | 3 |
| వృషభం | 7 | 3 | 7 | 3 |
| మిథునం | 5 | 5 | 3 | 6 |
| కర్కాటకం | 14 | 2 | 6 | 6 |
| సింహం | 2 | 14 | 2 | 2 |
| కన్య | 5 | 5 | 5 | 2 |
| తుల | 2 | 8 | 1 | 5 |
| వృశ్చికం | 8 | 14 | 4 | 5 |
| ధనస్సు | 11 | 5 | 7 | 5 |
| మకరం | 14 | 14 | 3 | 1 |
| కుంభం | 14 | 14 | 6 | 1 |
| మీనం | 11 | 5 | 2 | 4 |

### మౌఢ్యమి

### గురుమూఢం

ఈ సంవత్సరం 23-03-2011 పాల్గుణ బహుళ చవితి బుధవారం నాడు గురువు పశ్చిమంలో అస్తమించడంతో గురుమూఢమి ప్రారంభమయ్యి 22-04-2011 శ్రీఖర సంవత్సరం చైత్ర బహుళ పంచమి శుక్రవారం నాడు గురువు తూర్పున ఉదయించడంతో మూఢమి త్యాగం అవుతుంది. అంటే మార్చి 23 నుంచి ఏప్రిల్ 22 వరకు గురు మూఢము.

### శుక్ర మూఢం

23-10-2010 వికృతినామ సంవత్సర ఆశ్వయుజ పౌర్ణమి శనివారం నాడు శుక్రుడు పశ్చిమదిశలో అస్తమించడంతో శుక్రమౌఢ్యం ప్రారంభం. 4-11-2010 నాడు ఆశ్వయుజ బహుళ త్రయోదశి నాడు తూర్పున ఉదయించడంతో శుక్రమౌఢ్యం త్యాగమగును. అనగా 23-10-2010 నుంచి 4-11-2010 వరకు శుక్రమూఢమి.

### కర్తరి

శ్రీ వికృతి నామ సంవత్సర 04-05-2010 రా. 9-41లకు వైశాఖ బహుళ షష్ఠి మంగళవారం, రవి భరణీ నక్షత్రం మూడవ పాదంలో ప్రవేశించడంతో డొల్లు కర్తరీ ప్రారంభమగును. 11-05-2010 రా. గం॥ 7-03లకు వికృతి నామసంవత్సర అధిక వైశాఖ బహుళ త్రయోదశి మంగళవారం రవి కృత్తిక నక్షత్రం మొదటిపాదంలో ప్రవేశించడం ద్వారా పెద్ద కర్తరీ ప్రారంభమగును. 28-05-2010 తె. 4.33 లకు వికృతి నామ సంవత్సర నిజ వైశాఖ బహుళ పాడ్యమి శుక్రవారం రవి రోహిణి నక్షత్రం రెండవ పాదంలో ప్రవేశించడం ద్వారా కర్తరీ త్యాగమగును.

### రవి ఆరుద్ర ప్రవేశం

22-06-2010 సా. 5-22లకు వికృతి నామ సంవత్సరము జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి మంగళవారం స్వాతి నక్షత్రం తులరాశి, శివనామ యోగ, భద్ర కరణం, వృశ్చికలగ్నంలో రవి ఆరుద్ర నక్షత్రంలో ప్రవేశిస్తారు. దిన ప్రమాణం సూర్యోదయం 5-30, సూర్యాస్తమయం 6-33. రవి ఆరుద్ర నక్షత్రంలో ప్రవేశించు కాలం అస్తమయ్యే సమయం కాబట్టి ధరలు పెరుగుతాయి. పంటలకనుకూలమైన వర్షం కురుస్తుంది. ఏకాదశి అవడం వల్ల సుభిక్షం.

### పుష్కర నిర్ణయం

06-12-2010 ఉ.గం॥ 11-40లకు వికృతి నామ సంవత్సరం మార్గశిర శుద్ధ పాడ్యమి సోమవారం నాడు గురువు మీనరాశిలో ప్రవేశించడం వల్ల ప్రణీతానదీ పుష్కరాలు ప్రారంభం అవుతాయి.

| నక్షత్రాలు | | | | ఫలితాలు |
|---|---|---|---|---|
| అశ్విని | పుష్య | స్వాతి | అబిజిత్ | మనస్తాపం |
| భరణి | ఆశ్రేష | విశాఖ | శ్రవణం | రాజ పూజ్యం |
| కృతిక | మఖ | అనూ | ధనిష్ఠ | యుద్ధ భయం |
| రోహిణి | పుబ్బ | జ్యేష్ఠ | శతభిషం | అలంకార ప్రాప్తి |
| మృగశిర | ఉత్తర | మూల | పూ.భా | రోగ భయం |
| ఆరుద్ర | హస్త | పూ.షా | ఉ.భా | ఆయుర్వృద్ధి |
| పునర్వసు | చిత్త | ఉ.షా | రేవతి | ధన లాభం |

### ఫలితం

ఆది శూన్యే మహావ్యాధి. మధ్యశూన్యే మహాభయం. అంత్యశూన్యే మహాహాని. బేసి సంఖ్య ధన లాభాన్ని, సమసంఖ్య సమఫలాన్ని, శూన్య సంఖ్య శూన్య ఫలానిస్తుంది. మొదటి అంకె చైత్రాది ఆషాఢం వరకు, రెండవ అంకె శ్రావణాది కార్తీకం వరకు, మూడవ అంకె మార్గశీర్షాది ఫాల్గుణాన్ని చూపును.

# తొలి తెలుగు కథ నెల్లూరీయులదే!

**• దాచినా దాగని సత్యమిది**

తెలుగు కథ పుట్టి వందేళ్లు నిండిందని 'కథ' విస్తృత విశ్లేషణాత్మక వ్యాసాలను వివిధ పత్రికలు ప్రచురిస్తున్నాయి. ఇది ముదావహమైన విషయం.

విశ్లేషకులు, విమర్శకులూ మహానుభావుడు గురజాడ అప్పారావు కథ 'దిద్దుబాటు'ను తొలి తెలుగు కథగా ప్రకటించారు. ఈ కథ గురజాడ 1910 సంవత్సరంలో రాశాడని చెబుతున్నారు. కొందరు స్త్రీవాదులు బండారు అచ్చమాంబను తొలి కథకురాలిగా సాహిత్య చరిత్ర ముందుకు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. 1910 నుంచి 1950 వరకు తొలి తరం కథకులలో స్థానాపతి రుక్మిణమ్మ, పూడిపెద్ది వేంకటరమణయ్య, విశ్వనాథ కవిరాజు, మాడపాక పార్వతీశ్వర శర్మ, కాటూరి నరసింగరావు, వలమేటి బాలకృష్ణ, పిల్లలమర్రి వేదవతి ప్రభృతులు వున్నారు.

1950 నుంచి 1980 వరకూ మలితరం రచయితలలో విశ్వనాథ, చలం, గోపీచంద్, బుచ్చిబాబు, త్రిపుర, చింతా, కరుణకుమార, రావిశాస్త్రి, పాలగుమ్మి, గిడుగు, శ్రీపాద, ఒట్టికోట, మొక్కపాటి, అడవి బాపిరాజు, రావూరి, ఆర్.ఎస్.సుదర్శనం, దాశరథి, ముని మాణిక్యం, భానుమతి, కె.సభా, మధురాంతకం శ్రీపతి, శ్రీపాద, రామలక్ష్మి ఆదిగాగల వారున్నారు. నిజానికి తొలి తెలుగు కథ 1910లో ప్రారంభమయిందని చెబుతున్న వారంతా 1855లో సి.పి.బ్రౌన్ 'ద పాపులర్ తెలుగు టేల్స్'గా తెలుగులోనూ, ఆంగ్లంలోనూ ప్రచురించిన 'తాతాచారి కథల్ని' గురించి ఆలోచించలేదు. ఇది తెలుగు సాహిత్య విమర్శకులు, విశ్లేషకుల అవగాహనారాహిత్యమందామా? తెలుగుకథా చరిత్రను తిరిగి రాయవలసి వస్తుందని బద్ధకించారనుకుందామా? ఎందుకంటే నేలటూరి వేంకటాచలం పంతులు ఉరఫ్ తాతాచారి అనే వ్యక్తి క్రీ.శ.1848 ప్రాంతాల్లో నెల్లూరుజిల్లా, గూడూరు తాలుకా, నేలటూరు గ్రామం నుంచి చెన్నై వెళ్లి సి.పి.బ్రౌన్ కొలువులో వ్రాయసకాడు(లేఖకుడు)గా చేరాడు. అతడు తను రాసిన 24 కథల్ని సి.పి.బ్రౌన్‌కు చెప్పాడు. బ్రౌన్ మరికొన్ని అతని కథల్ని కూడా వినిపించుకొని, తనకు నచ్చిన అతని 24 కథల్ని, కృష్ణమాచారి అనే మరొక లేఖకుడి రెండు కథల్ని చేర్చి ఓ కథా సంపుటిగా 1855లో ప్రచురించాడు. దీన్నే అనువాదం చేసి ఇంగ్లీషులో కూడా ప్రచురించారు.

ఆ తర్వాత గిడుగు వేంకట అప్పారావు 1916లో ఈ సంపుటిని రెండవ ముద్రణగా అచ్చు వేయించారు. అటు పిమ్మట నెల్లూరీయుడు, పరిశోధకుడు బండి గోపాలరెడ్డి (బంగోరె) 1974లో మూడవ ప్రచురణగా ఈ పుస్తకాన్ని వెలుగులోకి తెచ్చారు. ఈ ప్రతి 'కారా' మాస్టారి గ్రంథాలయంలోనూ, మరికొందరి దగ్గర వున్నట్లు వారే అనేకానేక సందర్భాల్లో చెప్పి వున్నారు. పై అంశాల్ని బట్టి 1910లో గురజాడ 'దిద్దుబాటు'కు ముందే 1849-1855 ప్రాంతాల్లో నేలటూరి వేంకటాచలం పంతులు ఉరఫ్ తాతాచారిని తొలి తెలుగు కథకుడిగా గుర్తించవలసి వుంటుంది. అంటే తొలి తెలుగుకథ నెల్లూరీయుడిది అన్న మాట.

**పాయసం సుబ్రహ్మణ్యమహర్షి**

తాతాచారి కథల్లో పొంగలి కథ, పొగచుట్ట, గిరిన్మయూరే, మసీదు కథ ముఖ్యమైనవి. ఈ నేపథ్యంలో మేధావులు, విశ్లేషకులు, విమర్శకులు ఈ అంశాన్ని ఎందుకు విస్మరించారో అర్థం కాదు. సమాచారం తెలియకపోవడం, పాత చరిత్రను చెరిపి కొత్త చరిత్రను రాయడానికి బద్ధకించడం, పాత ప్రతిపాదనలపై ప్రేమ, కొత్త అంశాల ప్రతిపాదనలను అంగీకరించకపోవడం, వంటి అంశాలలో ఏదో ఒక అంశానికి పై వారంతా అంటిపెట్టుక వున్నారని చెప్ప వలసి వస్తుంది.

తాతాచారి కథల్ని గురించి బయటి ప్రపంచానికి తెలిసినప్పటికీ, నెల్లూరీయుడు తొలి తెలుగు కథకుడనే అంశం ఆవిష్కృతమైనప్పటికీ ముఖ్యంగా నెల్లూరు రచయితలలో కానీ, నెల్లూరు రచయితల సంఘాలలోకానీ, సాహితీ సాంస్కృతిక సంస్థల్లో కానీ ఎట్లాంటి చలనం రాలేదు. వీళ్లంతా ఏ మగత, మత్తు నిద్రల్లో మునిగి తేలుతున్నారోగానీ, నిన్న నెల్లూరు జిల్లా, కలువాయి మండలం 'గోపవరం' నివాసి ఆతుకూరి మొల్లమ్మను కడప జిల్లా వారు బద్వేలు, గోపవరం నివాసిగా ప్రకటించి, విగ్రహ ప్రతిష్ఠ చేసినా కూడా ఏవిధంగానూ స్పందించలేదు. నేడు నెల్లూరీయుడైన తాతాచారి కథల విషయంలోనూ ముందు కొచ్చి నడుం బిగించి 'తాతాచారి' తొలికథకుడని ఉద్యమ రూపంలో ప్రకటించలేదు.

నెల్లూరీయులకు ఇదెంతటి అవమానం? మరెంతటి అప్రతిష్ఠ?!

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11



# భానుశ్రీ పాపం పండింది!

మొదటి పేజీ కొరవ

రియల్ ఎస్టేట్ భూమి, గురివింద పూడిలో అరెకరాల వ్యవసాయ భూమి తదితర పత్రాలు దొరికాయి. అయితే ఈ దాడులకు మూడు రోజుల ముందుగా ఎబిఎన్ - ఆంధ్రజ్యోతి ఛానల్ భానుశ్రీ అవినీతిపై విస్తృత స్థాయిలో కథనాలు ప్రసారం చేసింది. ఈనాడు దినపత్రిక కూడా పోటీ పడి వార్తలు ప్రచురించింది. ఆ అలజడి తమ మీద దాడులకు దారి తీయవచ్చునన్న అనుమానంతో భానుశ్రీ ముందుగానే జాగ్రత్త పడిందని వినికిడి. ఇంట్లోని నగలు, డబ్బు, విలువైన ఆస్తి పత్రాలు సమస్తం రహస్య ప్రదేశానికి తరలించారని చెప్పన్నారు. అందువల్లనే దాడుల సమయంలో ఆమె ఇంట్లో కానీ, ఆమె చూపించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్లలో కానీ ఒక్క ఆస్తి పత్రం బయట పడలేదు. ఒక్క నగ దొరకలేదు. అయితే రాజీవ్‌భవన్ నిర్వాహకులు తాము సేకరించిన ఆస్తి పత్రాల సర్టిఫైడ్ కాపీలను అంతకు ముందే ఏసిబి అధికారులకు అందజేయడం వల్ల, అవి తనవి కాదు అని తప్పించుకోవడానికి వీలు లేకుండా పోయింది.



భానుశ్రీ సోదరుడు రమణరాజు ఇంట్లో ఏసిబి అధికారుల సోదా.

భానుశ్రీ ఇంటితో పాటుగా వరసకు ఆమె సోదరుడు చమర్తి రమణ రాజు, ఆమె ప్రధాన అనుచరుడు అమానుల్లాఖాన్, ఆమె సమీప బంధువులు ఎన్వీ.సులోచన, హైదరాబాదులోని ఆమె సోదరి ఇళ్లలో కూడా ఏసిబి అధికారులు సోదాలు జరిపారు. వీరందరితో ఆమెకు జాయింట్ ఆస్తులు వుండడం వల్లనే ఈ సోదాలు జరిగాయి. అయితే వారు కూడా ముందు జాగ్రత్త పడ్డారని అర్థమై పోయింది.

ఐదారేళ్లుగా భానుశ్రీ అహంకార వైఖరితో, దురుసు ప్రవర్తనతో, అధికార దుర్వినియోగంతో నానా బాధలు పడుతుండిన నెల్లూరు ప్రజానీకం ఈ వార్త వినగానే "పాపం పండిందని" వ్యాఖ్యానిస్తున్నారు. ఈ దెబ్బతోనైనా ఆమె ప్రవర్తన మారుతుందో లేదో చూడాలి.

## ఆయన ఆత్మహత్య అంటే ఈయన రాజీనామా అన్నాడు

భానుశ్రీ ఇంటి మీద ఏసిబి దాడి అన్న వార్త వినగానే జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే వివేకానందరెడ్డి హతాశులైపోయారు. తల మీద పిడుగు పడినట్లు చలించిపోయారు. దీన్ని ఎట్లా ఆపాలో వారికి అర్థం కాలేదు. హైదరాబాద్ నుంచి తమ పలుకుబడి అంతా వినియోగించి సోదాలు నిలపాలని ప్రయత్నం చేశారు. కానీ వీలు కాలేదు. దానితో కనీసం భానుశ్రీ భర్త అరెస్టు అయినా ఆపాలని చూశారు. హోంమంత్రిణి సబితా ఇంద్రారెడ్డి వద్దకు, మరొక మంత్రి పొన్నాల లక్ష్మయ్యను తోడు తీసుకుని వెళ్లి, అరెస్టు ఆపమని గట్టిగా కోరాడట రామనారాయణరెడ్డి. కానీ ఏసిబి తన శాఖ పరిధిలోనికి రాదని, అదీకాక దాడులు ప్రారంభమైన తర్వాత మంత్రుల మాట అధికారులు వినరని నిష్కర్షగా చెప్పారట సబితమ్మ. ఆ మాటతో ఎక్కడలేని నిర్వేదానికి లోనైన రామనారాయణరెడ్డి, మా ఇంటి మీద ఏసిబి దాడులు జరిగిన తర్వాత నేనీ ప్రభుత్వంలో వుండి కూడా వృథా, మంత్రిత్వానికే కాకుండా ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని బెదిరించారట ఆయన. సబితమ్మ ఆయన్ను ఓదార్చి, చల్లబరిచి పంపారు. మరొకప్రక్క వివేకా మాత్రం ఆవేశం ఆపుకోలేకపోయారు. ఈ కేసులను ఇక్కడితో ఆపకుంటే ఆత్మహత్య చేసుకొంటానని బెదిరించాడట. ఆయనకు అదొక అలవాటన్న సంగతి హైదరాబాదులో ప్రతి మంత్రికీ తెలుసు. శాసన సభ టిక్కెట్ ఇవ్వడం కష్టమన్నప్పుడూ ఆత్మహత్య అస్త్రం ప్రయోగించాడు వివేకానందరెడ్డి. మాజీ మేయర్ పులిమి శైలజను తొలగించడం వీలుకాదని ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి నిష్కర్షగా తేల్చి చెప్పినప్పుడూ ఎండ్రిన్ డబ్బా చూపించాడు. 1987లోనే, మునిసిపల్ ఛైర్మన్ టిక్కెట్ ఇవ్వనని చెప్పినందుకు విజయవాడ కెనాల్ గెస్ట్ హౌస్ ముందు ఆత్మహత్య ప్రహసనం నడిపాడు. అయితే అప్పుడున్నది ఎన్టీ రామారావు కాబట్టి, మీకు చావాలని వుంటే చావండి బ్రదర్ అని కరకుగా చెప్పి, లోపలకు వెళ్లి తలుపులేసుకోవడంతో, బెదిరింపులు మాని తల దించుకొని తిరిగి వచ్చాడు. ఇప్పుడు కూడా అదే అవమానం తప్ప ఆయన ఆత్మహత్య బెదిరింపులకు లోబడేవారు హైదరాబాద్‌లో ఎవరూ లేరు, పాపం.

## ఆనం కుటుంబం పరువు పెన్న పాలు

ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లు, భానుశ్రీ అవినీతి ఆనం కుటుంబం మెడకు చుట్టుకొన్నది. ఆమె అవినీతి పరురాలని లోకం కోడై కూస్తున్నా చూస్తూ సహించడమే కాక, తమ సంపూర్ణ సహకారం అందించడం వల్ల ఈ రోజు ఆమె పాపంలో వారూ భాగం పంచుకోక తప్పడం లేదు. సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి తమ మీద కక్ష కట్టి ఈ వ్యవహారాన్ని ఇంత దూరం తెచ్చారన్న ఆవేదనతో రగిలి పోతున్నారు ఆనం సోదరులు. ఆరునెలల్లో మునిసిపల్ ఎన్నికలు, ఆ వెంటనే శాసనమండలి ఎన్నికలు రానున్నాయి కాబట్టి, ఈ రెండు వర్గాలకు సయోధ్య కుదిర్చి, జిల్లా కాంగ్రెస్‌ను ఏకత్రాటి మీద నడపాలని మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి తలపోస్తుండినాడు. ఆ ప్రయత్నాలకు ఇప్పుడు ఆనం సోదరుల నుంచి స్పందన వచ్చే అవకాశం లేదు. ఈ దెబ్బతో జిల్లా కాంగ్రెస్ స్పష్టంగా రెండువర్గాలుగా చీలి పోయినట్లే లెక్క. వైఎస్ మరణం తర్వాత అసలే అస్తుబిస్తుగా వున్న కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మరింత అధ్వాన్నం కాబోతుంది.



నెల్లూరు శోధన్‌నగర్‌లోని భానుశ్రీ స్వగృహం.

## సాయిబాబా మీద ప్రమాణం

ఎబిఎన్ - ఆంధ్రజ్యోతి ఛానల్, ఈనాడు దినపత్రికలలో తన అక్రమ ఆస్తుల మీద వార్తా కథనాలు రాగానే భానుశ్రీ బుకాయింపులకు దిగారు. తాను నిజాయితీపరురాలినని ప్రజలను నమ్మించడానికి దేముడిని అడ్డం పెట్టుకొన్నారామె. కార్పొరేషన్ ఆఫీసు ప్రాంగణంలో షిర్డి సాయిబాబా గుడికి పత్రికల వారిని వెంటబెట్టుకొని వెళ్లి, తాను ఎటువంటి అవినీతికి పాల్పడలేదని దేముడి ముందు హారతి వెలిగించి ప్రమాణం చేశారామె. అది జరిగిన 48 గంటలలోనే ఏసిబి దాడులు జరిగి, ఆమె భర్త జైలుకు వెళ్లవలసి వచ్చింది. రాజకీయ నాటకాలకు, బూటకాలకు దేముడిని అడ్డం పెట్టుకోవడం ఎంత పెద్ద పొరపాటో ఆలస్యంగా అర్థమై వుంటుంది ఆమెకు.

## క్రింద పద్దా పై చెయ్యి...

ఇంత జరిగిన తర్వాత కూడా అటు భానుశ్రీ, ఇటు వివేకానందరెడ్డిల తీరు మారడం లేదు. యథాపూర్వం వలెనే మాట్లాడుతున్నారు వారు. క్రింద పద్దా పైచెయ్యి తమది అన్పించుకోవాలని చూస్తున్నారు. భానుశ్రీ అక్రమ ఆస్తుల విలువ వంద కోట్లకు మించిందని గ్లోబల్స్ ప్రచారం చేశారని, కానీ దాడులలో మూడు కోట్లకు మించి దొరకలేదు కాబట్టి తమ మీద జరిగిన ప్రచారం తప్పని తేలిపోయిందని ప్రకటనలు చేశారు వారిద్దరూ. భానుశ్రీ అయితే తనను ఇబ్బంది పెట్టిన వారి కుటుంబాలు సర్వనాశనమై పోతాయని శాపనార్థాలు పెడుతున్నారు. అంతే తప్ప, రేపటి నుంచి జనానికి ఏమి సమాధానం చెప్పాలి, వీధిలోకి వచ్చి ముఖం ఎట్లా చూపించాలి అన్న లజ్జాపూరిత భావనలు ఏ కోశానా కన్పించడం లేదు వారిలో.



మేయర్ భానుశ్రీ బినామీగా కోట్ల రూపాయల ఆస్తులున్నా రేకుల ఇంట్లో నివసిస్తున్న బాలయ్య.

## కార్టూన్ స్కేప్




హాల్ టిక్కెట్‌లో తెల్లగా వున్నది నేనే సార్... దీపం పెట్టుకుని చదివి ఇలాగయ్యానంతే!!




Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.